VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 01.07.2026
సంపుటి : 08 సంచిక : 22 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ గారిని డీజీపీ ఆఫీస్ లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రివర్యులు మోతుకుపల్లి నర్సింహులు, హైకోర్ట్ అడ్వకేట్ సగరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ వెలుతురు జూన్ 30:





# రైతు భరోసా నిధుల విడుదల..

2

- 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్లు
- రైతులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి
- తొలి విడతలో రూ.2,482.02 కోట్ల జమ
- 41.37 లక్షల మంది రైతులకు లబ్ధి
- రైతు భరోసా రూ.12 వేలకు పెంపు
- ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల చెల్లింపు
- రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ పూర్తి
- ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్‌దే కీర్తి: సీఎం
- బీఆర్ఎస్‌పై అప్పులు, పాలనపై విమర్శలు
- రైతులకు మార్కెట్ డిమాండ్‌కు తగ్గ సాగు సూచన
- 9 రోజుల్లో మరో రూ.9 వేల కోట్లు విడుదల

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన నూతన సీఎస్ సంజయ్ జాజు

- మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన నూతన ప్రధాన కార్యదర్శి
- ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో భేటీ



## రైతు భరోసాపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్



- 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టారని ఆరోపణ

## రైతులకు కాంగ్రెస్ రూ.29,300 కోట్లు బాకీ



- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

## పేదవాడి ఇంటి కలను సాకారం చేస్తున్నాం

- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- ముత్తారం గ్రామంలో లబ్ధిదారుడి ఇంటికి కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశం
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్ర



దమైన నివాసం కల్పిస్తామని హామీ

- ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని వ్యాఖ్య

## తెలంగాణలో బీజేపీదే అధికారం

- కార్యకర్తల మద్దతుతోనే నేను పనిచేస్తున్నా: బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్‌రావు
- రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కృతజ్ఞతలు
- పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతి



నిధుల సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు

- బీజేపీ వ్యక్తుల పార్టీ కాదని.. కార్యకర్తలే వెన్నెముక అని వ్యాఖ్య
- 'టీమ్ బీజేపీ' స్ఫూర్తితో ప్రతి ఎన్నికలో విజయమే లక్ష్యమని పిలుపు
- తెలంగాణకు జాతీయ నాయకత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడి

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్..

**నిజామాబాదు వెలుతురు జూన్ 30:**

సమాజానికి వెన్నెముక అయిన రైతులకు అధిక ప్రాధాన్యతిస్తూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.అన్నదాతలను ఆర్థికంగా ఆదుకోవాలనే సంకల్పంతో వారికి పెట్టుబడిగా 'రైతు భరోసా' అందిస్తూ వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల్లో పూర్తి విశ్వాసం కలిగిస్తోంది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో నిత్యం ముందుండే కాంగ్రెస్ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అన్నదాతలకు అభయం



హస్తం అందిస్తోంది.

▶ మిగతా 2లో

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు.. ఆర్మీ ఖండన

- పీఎల్ఏ శిబిరాలపై వస్తున్న కథనాల్లో నిజం లేదని స్పష్టీకరణ
- ఆధారాలు లేని తప్పుడు ప్రచారమంటూ భారత సైన్యం వివరణ



- సరిహద్దు సమీపంలో చైనా కార్యకలాపాలపై స్థానిక సంస్థ వినతి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని నాహ్ వెల్ఫేర్ సొసైటీ విజ్ఞప్తి

## నగరాభివృద్ధిపై కార్పొరేషన్ పాలక సమావేశం: హాజరైన టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాదు వెలుతురు జూన్ 30:**

నిజామాబాద్ నగర పాలక సంస్థలో మేయర్ ఉమారాణి అధ్యక్షతన మంగళవారం పాలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.నగరాభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భారత సైన్యానికి కొత్త సారథి.. ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరణ

- దేశ 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ ధీరజ్ సేథ్
- జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో కొత్త సైన్యాధిపతిగా నియామకం
- ఆర్మోర్డ్ కార్ప్స్ నుంచి ఆర్మీ చీఫ్‌గా ఎదిగిన ఏడో



అధికారి

- సౌత్ బ్లాక్‌లో సైనిక సంప్రదాయాల నడుమ బాధ్యతల స్వీకరణ
- జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాల్లో విశేష అనుభవం

## ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత: పొన్నం ప్రభాకర్

- తెలంగాణకు ఎరువుల సరఫరాను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ
- ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధి లోనేనని స్పష్టీకరణ
- తెలంగాణలోని ఎరువుల కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్
- ఎరువుల కొరత కొనసాగితే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరిక
- రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- హుస్నాబాద్‌లో సర్ ఓటరు సవరణ ప్రక్రియను పరిశీ



లించిన మంత్రి

- 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న నమోదును పరిశీలించి అధికారులకు సూచనలు

# రైతు భరోసా నిధుల విడుదల..

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

శిల్పకళా వేదికలో నిర్వహించిన రైతు భరోసా సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి తొలి విడతలో 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లను జమ చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు.రైతులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల్లో వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు కృషి చేశామని అన్నారు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్లను మాఫీ చేశామని, రైతు భరోసా మొత్తాన్ని రూ.12 వేలకు పెంచి ఇప్పటివరకు రూ.27 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. తాజా విడతతో కలిపి రైతు భరోసా కింద మొత్తం రూ.36 వేల కోట్లు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన పథకమని, నెలకు రూ.1,000 కోట్ల చొప్పున విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. సన్న వడ్ల బోనస్, రైతు బీమా, ఇతర పథకాలతో కలిపి రైతుల కోసం రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసిందని విమర్శించిన సీఎం, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్టీసీ, సింగరేణిని లాభాల బాట పట్టించామని పేర్కొన్నారు. ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చామని చెప్పారు.మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని సీఎం సూచించారు. రైతు వేదికల్లో ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. మరో 9 రోజుల్లో రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, పోన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పలువురు ప్రజాప్రతినిధులు రైతు వేదికల నుంచి వర్చువల్‌గా సభలో పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీదే అధికారం

- మూడు రోజుల పాటు రాష్ట్రంలో నితిన్ నబీన్ పర్యటనను ప్రస్తావన
- రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరై దిశానిర్దేశం చేశారని వ్యాఖ్య
- తెలంగాణలోనూ బీజేపీ విజయ పతాకం ఎగురవేస్తుందనే పూర్తి విశ్వాసం వ్యక్తం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**



భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒక సంవత్సరం కాలంలో తనపై విశ్వాసం ఉంచి ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఇదే సహకారం, ఇదే ఆశీర్వాదం రాబోయే రోజుల్లో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. భారతీయ జనతా పార్టీ ఒక్క వ్యక్తి ఆధారంగా నడిచే పార్టీ కాదని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. అందరూ 'టీమ్ బీజేపీ' స్ఫూర్తితో పనిచేస్తూ ప్రతి కార్యక్రమంలో, ప్రతి ఎన్నికలో విజయాన్ని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.తెలంగాణకు పార్టీ జాతీయ నాయకత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నితిన్ నబీన్ మూడు రోజుల పాటు తెలంగాణలో విస్తృతంగా పర్యటించి కార్యకర్తలను కలవడం, రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేయడం ఇందుకు నిదర్శనమని అన్నారు.జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అస్సాంలో మూడోసారి, పుదుచ్చేరిలో రెండోసారి, పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి పార్టీ విజయాలు నమోదు చేసిందని గుర్తు చేశారు. అదే విజయపరంపర తెలంగాణలో కూడా కొనసాగుతుందనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో విజయపతాకం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు.. ఆర్మీ ఖండన

- వేట, పశువుల మేత ప్రాంతాల్లో చైనా నిర్మాణాలు చేపట్టిందని ఆరోపణ
- భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై ఇటీవలే బీజింగ్‌లో కీలక చర్చలు
- వినతిపత్రం ఆధారంగానే మీడియాలో కథనాలు వచ్చినట్లు సమాచారం
- సరిహద్దు పరిస్థితిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్న భారత సైన్యం

**అరుణాచల్‌ప్రదేశ్ వెలుతురు జూన్ 30:**

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) చొరబాట్లకు పాల్పడి సైనిక శిబిరాలు ఏర్పాటు చేసిందంటూ వెలువడిన వార్తలను భారత సైన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ ఈ విషయంలో ప్రజలు నిరాధార వార్తలను నమ్మొద్దని సూచించింది.ఇటీవల కొన్ని మీడియా కథనాల్లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని తక్సింగ్ ప్రాంతంలో భారత్–చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ కార్యకలాపాలు పెరిగాయని పేర్కొన్నారు. ఈ కథనాలకు ఆధారంగా నాహ్ ట్రైబల్ గ్రూప్‌కు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ గతంలో ప్రభుత్వ అధికారులకు సమర్పించిన వినతి పత్రాన్ని ప్రస్తావించారు.ఆ వినతిపత్రంలో గత 10 నుంచి 15 ఏళ్లుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంబడి క్రమంగా తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ప్రజలు వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం ఉపయోగించే ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని పేర్కొన్నారు. ఈ నిర్మాణాల కారణంగా స్థానికుల సంప్రదాయ జీవన విధానంపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకోవాలని నాహ్ వెల్ఫేర్ సొసైటీ వినతిపత్రంలో కోరింది. ఈ వినతిపత్రాన్ని ఆధారంగా చేసుకుని కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి.అయితే ఈ కథనాలపై స్పందించిన భారత సైన్యం, అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైనిక శిబిరాలు ఏర్పాటు చేశారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. సరిహద్దు పరిస్థితిపై భారత సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉందని, దేశ భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపింది.కాగా, ఇటీవల బీజింగ్‌లో భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండు దేశాల ప్రతినిధులు సరిహద్దు పరిస్థితులు, పరస్పర సహకారంపై నిర్మాణాత్మకంగా చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ సమావేశం అనంతరం అరుణాచల్‌ప్రదేశ్‌కు సంబంధించిన ఈ కథనాలు వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన నూతన సీఎస్ సంజయ్ జాజు

- పరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం
- నూతన బాధ్యతల నేపథ్యంలో ముఖ్యమంత్రితో సమావేశం
- సమావేశంలో కె. రామకృష్ణారావు కూడా పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది
- సీఎస్ పదవి బాధ్యతల స్వీకరణకు ముందు కీలక భేటీ
- రాష్ట్ర పరిపాలనలో సమన్వయంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాల వెల్లడి
- నూతన బాధ్యతల నిర్వహణకు సీఎం శుభాకాంక్షలు తెలిపినట్లు సమాచారం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజు మంగళవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ సంస్థలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశం రాష్ట్ర పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఈ భేటీ జరగడం విశేషంగా మారింది.ఈ సందర్భంగా రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి, సంజయ్ జాజు మధ్య చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పరిపాలనా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచే అంశాలపై కూడా ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడంలో ప్రధాన కార్యదర్శి పాత్ర కీలకమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించినట్లు తెలిసింది.సమావేశంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి సలహాదారుగా, సీఎం ఎక్స్–అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన కె. రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు. పరిపాలనా వ్యవహారాల్లో కొనసాగింపు, బాధ్యతల బదిలీ, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ఆయన తన అనుభవాలను పంచుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.పరిపాలనా సేవల్లో విశేష అనుభవం కలిగిన సంజయ్ జాజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో ప్రభుత్వ యంత్రాంగంలో కొత్త ఉత్సాహం నెలకొన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రజలకు సేవల అందింపును మరింత మెరుగుపరచడం వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రితో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా సంజయ్ జాజుకు రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వ బృందం సమిష్టిగా పనిచేయాలని, పరిపాలనను మరింత ప్రజాకేంద్రీకృతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# రైతు భరోసాపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- రైతు భరోసా విడుదలను సభగా మార్చి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శ
- నాలుగుసార్లు రైతు భరోసా చెల్లింపులు నిలిపివేశారని కేటీఆర్ ఆరోపణ
- రుణమాఫీ, యూరియా కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత
- కేసీఆర్ హయాంలో రూ.73 వేల కోట్ల రైతుబంధు అందించామని గుర్తుచేసిన కేటీఆర్
- రైతు వ్యతిరేక విధానాలను అన్నదాతలు క్షమించరని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం జరగనున్న వేళ, సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస ఆరోపణలు చేశారు.గత 30 నెలల పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ప్రభుత్వం రైతులకు అందకుండా ఎగ్గొట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాల్సిన నిధులను విడుదల చేయకుండా, ఇప్పుడు సభల పేరుతో ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఆశీర్వాద సభల పేరుతో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం పీఆర్ స్టంట్ తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించారు.రైతు భరోసా పథకాన్ని ఏకంగా నాలుగుసార్లు నిలిపివేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ప్రస్తుతం కొద్దిమంది రైతులకు మాత్రమే పరిమితంగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు.రుణమాఫీ అంశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. దాదాపు రూ.50 వేల కోట్లతో చేపట్టాల్సిన రుణమాఫీని పూర్తిగా అమలు చేయకుండా రైతులను నిరాశపరిచారని విమర్శించారు.రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం భారీ సభలు నిర్వహిస్తోందని ఆరోపించారు. పంట కొనుగోళ్ల విషయంలో కూడా కేంద్రం ఎంత కొనుగోలు చేస్తే అంతే కొనుగోలు చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు.తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు పథకం ద్వారా 11 విడతల్లో రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ పథకం తెలంగాణ వ్యవసాయ రంగానికి బలమైన అండగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.రైతు వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ తీరును అన్నదాతలు ఎన్నటికీ క్షమించరని హెచ్చరించారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిచిపోతారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు ద్రోహిగా గుర్తుండిపోతుందని తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# రైతులకు కాంగ్రెస్ రూ. 29,300 కోట్లు బాకీ

- రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అంటూ మండిపాటు
- రైతు భరోసా పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపణ
- మరో రెండు విడతల్లో పరిమిత ఎకరాలకే రైతు భరోసా చెల్లించారని ఆరోపణ
- రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను అన్నదాతలు గమనిస్తున్నారని వ్యాఖ్య

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.29,300 కోట్ల మేర బకాయి పడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభ వాస్తవానికి రైతు వంచన సభగా మారిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సభల పేరుతో ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు.ఎన్నికల సమయంలో ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కేవలం రూ.12 వేలే చెల్లించిందని హరీశ్‌రావు ఆరోపించారు. అందులోనూ ఒక పంట సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను పూర్తిగా ఎగ్గొట్టిందని విమర్శించారు.మరో విడతలో రెండు ఎకరాల వరకు మాత్రమే రైతులకు పెట్టుబడి సాయం అందించిందని, అనంతరం మూడు ఎకరాల వరకు పరిమితం చేసి చెల్లింపులు జరిపిందని పేర్కొన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు ప్రభుత్వ హామీలకు దూరమయ్యారని, రైతాంగంలో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు.రైతుబంధు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రూ.29,300 కోట్ల మేర రైతులకు బకాయి పడిందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేకుంటే రైతులు తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే రెండుసార్లు విజయవంతంగా 'రైతు భరోసా' అందించి రాష్ట్ర రైతులను ఆదుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి 2026 జూన్ 30వ తేదీన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 'రైతు భరోసా' అందిస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ముందు వరంగల్ వేదికగా 'రైతు డిక్లరేషన్'లో ప్రకటించిన విధంగా రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నాలకు బోనస్, రైతు బీమా, రైతు కూలీలకు ఇందిరమ్మ భరోసా వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతిస్తూ బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. రాష్ట్రం ఆవిర్భావం నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ కలిగిన తెలంగాణ పదేండ్ల తర్వాత రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలైంది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకే ప్రతి నెల రూ.6500 కోట్ల అసలు, మిత్తీ చెల్లించాల్సిన క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లోనూ మన రైతులందరూ సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని విశ్వసిస్తున్న కాంగ్రెస్ అందుకు అనుగుణంగా పరిపాలిస్తుంది. ఈ నేపథ్యంలో ఒకవైపు ఆర్థిక రంగాన్ని చక్కదిద్దుతూ మరోవైపు సంక్షేమ పథకాలను తుచా తప్పకుండా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమది పేదల ప్రభుత్వమని గర్వంగా చెప్పుకుంటోంది. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం కష్టంగా మారుతున్న సమయంలో రైతులు వలసలు పోతున్న దశలో వారిలో వ్యవసాయంపై పూర్తి విశ్వాసం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిగా సీజన్‌కు అనుగుణంగా ఏటా ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా అందిస్తోంది. 2025 జూన్‌లో 70 లక్షలు, 2026 మార్చిలో 70 లక్షల మందికి రైతు భరోసా అందించిన ప్రభుత్వం ఇప్పుడు మూడోసారి జూన్ 30వ తేదీన ఒకే విడతలో అందించనున్నారు. రైతుల కోసం నిత్యం తపన పడే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించి యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా సన్న వరికి బోనస్ అందించడంతో రాష్ట్రంలో సన్నాల సాగు 60 శాతం పెరిగింది. దేశంలోనే తొలిసారిగా రైతు కూలీలను గుర్తించి వారిలో విశ్వాసం కలిగించేలా 'ఇందిరమ్మ రైతు భరోసా' అందిస్తోంది. రైతు కుటుంబాలందరికీ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తూ వేల కోట్ల రూపాయలతో రైతు బీమా కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు లభించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం భారీగా పంటలను కొనుగోలు చేస్తోంది. ఆర్థికంగా ఎంత భారమైనా వెనకడుగు వేయకుండా కాంగ్రెస్ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోంది. అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటే భరించలేని బీఆర్ఎస్ పార్టీ అక్కసుతో అవాస్తవాలను ప్రచారం చేస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు పేరిట ఎకరాకు రూ.10 వేలు మాత్రమే ఇస్తే కాంగ్రెస్ సర్కార్ అధికంగా రైతు భరోసా కింద రూ.12 వేలు ఇస్తుంది. అర్హులైన రైతులకు మేలు జరిగేలా 'రైతు భరోసా'లో కాంగ్రెస్ ప్రభుత్వం విధి విధానాలను రూపొందించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'రైతు బంధు' పథకం ప్రధానంగా ఆ పార్టీలోని రాబందులకే ఉపయోగపడింది. గత ప్రభుత్వ అవకతవకలు పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి సర్కారు వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అందించాలని నిర్ణయించడంతో ప్రజా నిధులు దుర్వినియోగం కావడం లేదు. కేసీఆర్ హయాంలో బీఆరఎస్ బడా నేతలకు చెందిన రాళ్లు, రప్పలకు, రియల్ ఎస్టేట్ భూములకు, రోడ్లు వేసే భూములకు, కబ్జా భూములకు, మైనింగ్ చేస్తున్న భూములకు ఇలా వ్యవసాయ యోగ్యం కాని పలు భూములకు నాడు అక్రమంగా 'రైతు బంధు' అందించి ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఏమాత్రం ఉపయోగపడని భూములకు రైతు బంధు పథకం కింద రూ.22 వేల కోట్లకుపైగా చెల్లించి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది.అప్పుడు బడా నేతలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు విమానాల్లో వచ్చి రైతు బంధు చెక్కులు తీసుకున్నారంటే ప్రభుత్వ నిధుల ఎలా దుర్వినియోగం అయ్యాయో అర్థమవుతోంది.దీనికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం పంట పండించే భూములకు మాత్రమే 'రైతు భరోసా' ప్రకటించడంతో నిజమైన అన్నదాతలకు న్యాయం జరుగుతుంది. రైతులకే కాకుండా రైతు కూలీలకు కూడా సమన్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూమిలేని రైతు కూలీలకు ప్రభుత్వ నిర్ణయం శాపంగా మారకూడదని, వారిని కూడా ఆదుకోవాలనే లక్ష్యంతో 'వరంగల్ డిక్లరేషన్'లో ప్రకటించినట్టు దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఏటా రూ.12వేలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడంతో వ్యవసాయం చేసే రైతులందరికీ న్యాయం చేసినట్టయ్యింది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో వ్యవసాయ కూలీల ఆవేదనను అర్థం చేసుకొని, అధికారంలోకి వచ్చాక వారిని ఆదుకునేలా చర్యలు తీసుకొని మాట నిలబెట్టుకుంది.వ్యవసాయం బలపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందనే విశ్వాసంతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుంది. రైతు భరోసా, రుణమాఫీ, సన్నాలకు బోనస్, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల ద్వారా రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా అండగా నిలుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేస్తోంది. ఏరువాక పౌర్ణమి శుభ సందర్భం మరుసటి రోజు జూన్ 30న ప్రభుత్వం నిర్వహించనున్న రైతు భరోసా పంపిణీ మరోసారి అన్నదాతల పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనంగా నిలవనుంది.రైతు సంతోషమే రాష్ట్ర సుభిక్షతకు పునాది అనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం తన ప్రయాణాన్ని

# అయోధ్య రామమందిరంలో జరిగిన చోరీపై SIT నివేదికను వెంటనే ప్రజల ముందుంచాలి

- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ. ప్రసన్నకుమార్ శర్మ

హైదరాబాద్ వెలుతురు జూన్ 30: అయోధ్య శ్రీరామమందిరంలో జరిగినట్లు వెలుగులోకి వచ్చిన కానుకల చోరీ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) సమర్పించిన నివేదికను వెంటనే ప్రజల ముందుంచి, భక్తుల మనసుల్లో నెలకొన్న అన్ని సందేహాలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ. ప్రసన్నకుమార్ శర్మ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దేవుడికి భక్తులు సమర్పించిన కానుకలను దోచుకున్న వారిపై SIT కీలక వివరాలు సేకరించినట్లు వార్తలు వస్తున్నాయని, అందువల్ల ఆ నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాస్తవాలను వెల్ల డించాలని ఆయన కోరారు.

భక్తుల మనోభావాలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకుని అధికారంలోకి వచ్చిన వారు, కనీసం ఇప్పటికైనా మర్యాద పురుషోత్తముడైన శ్రీరామచంద్రునికి, అలాగే విశ్వాసంతో కానుకలు సమర్పించిన కోట్లాది మంది భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. చోరీకి గురైన మొత్తం ఎంత, అందులో ఎంత మేరకు తిరిగి స్వాధీనం చేసుకున్నారో వెల్లడించి, ఈ వ్యవహారంలోని ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో, ప్రతిపక్ష నాయకుడు, రాజ్యసభ మరియు పార్లమెంట్ సభ్యులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులతో కూడిన సమావేశాన్ని ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను దేశ ప్రజలకు వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కొన్ని వందల సంవత్సరాలుగా అయోధ్య రామాలయ నిర్మాణం కోసం పోరాడిన అనేక మంది భక్తుల త్యాగాలు, కష్టాలు, భావోద్వేగాలను దెబ్బతీసేలా ఈ ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై దేశ ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు.

నిజమైన సనాతన ధర్మాన్ని విశ్వసించి ఆచరించే వారికి ఈ పరిణామాలు అత్యంత బాధాకరమైనవని ఆయన వ్యాఖ్యానించారు.

అయోధ్యలో శ్రీరామమందిర నిర్మాణానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ చారిత్రక పాత్రను కూడా ఆయన ప్రస్తావించారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హయాంలో రామజన్మభూమి తలుపులు తెరవడానికి అనుమతి లభించిందని, శిలాన్యాసానికి కూడా మార్గం సుగమం అయిందని గుర్తు చేశారు.

ప్రజలు విశ్వాసంతో ఇచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న వారిపై ఉందని, కానీ ప్రస్తుతం ట్రస్ట్ మరియు దానికి మద్దతుగా ఉన్న కొందరి వ్యవహారశైలి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు.

ఈ మొత్తం వ్యవహారంపై దేశ ప్రధానమంత్రి వెంటనే స్పందించి, పూర్తి పారదర్శకతతో వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ. ప్రసన్నకుమార్ శర్మ విజ్ఞప్తి చేశారు.

రామ మందిరంలో భక్తులు సమర్పించిన కానుకల చోరీ అనే మహాపాపం వెలుగులోకి వచ్చిన తర్వాత ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT)ను ఏర్పాటు చేశారు. ఆ SIT తన నివేదికను సమర్పించి చాలా కాలం గడిచినప్పటికీ, దానిని ఇప్పటివరకు ప్రజలకు వెల్లడించలేదు.

ఈ SIT పని ఏమిటంటే—చిన్న స్థాయి వ్యక్తులను మాత్రమే పట్టుకుని, పెద్దలను వదిలేయడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించడమే అన్న విమర్శలు ఉన్నాయి.

దేశ ప్రజలు తమ అపార విశ్వాసంతో దానాలు సమర్పించారు. అయితే వారి విశ్వాసంతో చెలగాటమాడిన ఘటన జరిగినప్పుడు, ఒక గొప్పమైన SITను ఏర్పాటు చేసి, దాని నివేదికను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు.

సీసీటీవీ దృశ్యాల ప్రకారం కేవలం 40 రోజుల్లోనే 70 చోరీలు జరిగినట్లు తెలిసింది. అలాంటప్పుడు గత ఐదున్నర సంవత్సరాల్లో మొత్తం ఎన్ని చోరీలు జరిగాయో, దానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎవరు వెల్లడిస్తారు?

కానుకల చోరీ' ఒక వ్యవస్థీకృత ముఠా ద్వారా నిర్వహించబడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నేను భారత్ సమాచార్లో చదివిన కథనం ప్రకారం:

- చంపత్ రాయ్ భద్రత కోసం ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీని నియమించారని, అందులో సుమారు 400 మంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు.*
- ఆ సెక్యూరిటీ ఏజెన్సీకి సంవత్సరానికి రూ.12 కోట్లు చెల్లిస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు.
- ఆ సెక్యూరిటీ ఏజెన్సీ ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న బీహార్‌కు చెందిన మాజీ ఎంపీకి చెందినదని కూడా పేర్కొన్నారు.
- అలాగే, ఈ సెక్యూరిటీ గార్డులు కానుకల సేకరణ మరియు తరలింపు జరిగే మార్గాల వద్ద విధులు నిర్వహించే వారని కథనం పేర్కొంది.

అలాంటి పరిస్థితిలో, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా బలగాలు ఇప్పటికే విధుల్లో ఉన్నప్పుడు, అదనంగా నియమించిన ఈ 400 మంది ప్రైవేట్ భద్రతా సిబ్బంది అసలు ఏ బాధ్యతలు నిర్వహించారనే ప్రశ్న తలెత్తుతోంది.




పి.ప్రసన్నకుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

జై సితారామ్...హర హర మహాదేవ్*

# యువత భవిష్యత్తుతో చెలగాటం ఆపండి – ప్రధాని మోదీ మౌనం వీడాలి

హైదరాబాద్ వెలుతురు జూన్ 30: దేశ యువత తమ భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. కానీ వరుసగా జరుగుతున్న పేపర్ లీకులు వారి కలలను ఛిద్రము చేస్తున్నాయి.మొన్న నీట్ పరీక్ష వివాదం, ఇప్పుడు మహారాష్ట్రలో టీఈటీ ప్రశ్నపత్రం లీక్ ఘటన – ఇవన్నీ దేశంలోని పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రతి పేపర్ లీక్ వెనుక లక్షలాది మంది విద్యార్థుల కన్నీళ్లు, వారి తల్లిదండ్రుల ఆశలు, ఎన్నో సంవత్సరాల కష్టం దాగి ఉన్నాయి.ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరచడం వంటి రాజకీయాల కంటే, దేశ యువత భవిష్యత్తును కాపాడటం ప్రభుత్వాల మొదటి బాధ్యత కావాలి. ప్రభుత్వాలు రాజకీయాలపై కాకుండా, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనంపై దృష్టి సారించాలి.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ఇప్పటికైనా ఈ అంశంపై మౌనం వీడి స్పందించాలి. దేశవ్యాప్తంగా జరుగుతున్న పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకొని, దోషులను శిక్షించి, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలి.దేశ యువత భవిష్యత్తు రాజకీయాలకు బలి కాకూడదు. విద్యార్థుల కష్టం, ప్రతిభకు విలువ ఇచ్చే పారదర్శక పరీక్షా వ్యవస్థను నిర్మించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. యువత ఆశయాలను కాపాడండి... వారి భవిష్యత్తును నాశనం కాకుండా చూడండి.



కొప్పుల ప్రవీణ్ కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ

# 50% సీలింగ్ దాటిన EWS 10 % రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం

- డా అవ్వారు వేణు కుమార్ 42% బీసీ రిజర్వేషన్ పోరాట కమిటీ స్టేట్ కో-ఆర్డినేటర్
- మెరిట్‌ని హత్య చేసిన EWS రిజర్వేషన్

హైదరాబాద్ వెలుతురు జూన్ 30:



సుప్రీంకోర్టు నిర్దేశించిన 50% రిజర్వేషన్ పరిమితిని EWS 10% దాటిందని, దీంతో మొత్తం రిజర్వేషన్లు 60%కి చేరి రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని 42% బీసీ రిజర్వేషన్ పోరాట కమిటీ స్టేట్ కోఆర్డినేటర్ డా. అవ్వారు వేణు కుమార్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

1.మెరిట్ హత్య:EWS వల్ల ఓపెన్ కేటగిరిలో 10% సీట్లు తగ్గిపోయాయి. 95 మార్కులు సాధించిన SC, ST, బిసి మెరిట్ విద్యార్థులకు కూడా సీట్లు దక్కడం లేదు. "EWS మెరిట్‌ని హత్య చేస్తుంది" అని ఆయన ఆరోపించారు.

2.ద్వంద్వ ప్రమాణాలు:బిసి లకు క్రీమీ లేయర్ విధించి వార్షిక ఆదాయం ₹8 లక్షలు దాటితే రిజర్వేషన్ తొలగిస్తున్నారు. కానీ EWS పేరుతో ఏడాదికి 8 లక్షలు సంపాదించే ధనిక అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారు. "ఇది ప్రభుత్వాల సిగ్గులేని తనం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

3.EWS సర్టిఫికెట్ల దందా:రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకొని కోటీశ్వరులకు, భూస్వాములకు EWS సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. "బెంజ్ కారులో తిరిగే వాడు కూడా EWS అవుతున్నాడు. ఇదేనా సామాజిక న్యాయం?" అని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వానికి అల్టిమేటం:ప్రభుత్వం వెంటనే EWS రిజర్వేషన్‌పై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించాలి. అక్రమ EWS సర్టిఫికెట్లను రద్దు చేసి, దోషులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో తెలంగాణ వ్యాప్తంగా సామాజిక న్యాయ సభలు నిర్వహించి, వివిధ రూపాలలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డా. అవ్వారు వేణు కుమార్ హెచ్చరించారు.

# సునీల్ భారతి మిట్టల్‌తో సీఎం రేవంత్ భేటీ




- ప్రభుత్వ విద్యా సంస్కరణలు, పెట్టుబడులపై విస్తృత చర్చ
- ప్రభుత్వ పాఠశాలల ప్రక్షాళనపై సీఎం వివరాలు
- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీల ఏర్పాటుపై ప్రభుత్వ ప్రణాళిక వెల్లడి
- చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వేగంగా ప్రారంభించాలని సూచన
- తెలంగాణలో భారీ ఏఐ, డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుపై ప్రతిపాదన
- హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ కార్యకలాపాల విస్తరణకు పిలుపు
- ప్రభుత్వంతో సమన్వయం కోసం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నియమించనున్న భారతీ ఎంటర్‌ప్రైజెస్
- ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని మిట్టల్ హామీ

హైదరాబాద్ వెలుతురు జూన్ 30:

ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, విద్యా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను ముఖ్యమంత్రి సునీల్ మిట్టల్‌కు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునిక అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సునీల్ మిట్టల్‌ను ముఖ్యమంత్రి కోరారు. అంతేకాకుండా తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.హైదరాబాద్‌ను డిజిటల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ కార్యకలాపాలను రాష్ట్రంలో మరింత విస్తరించాలని సీఎం కోరారు. భవిష్యత్ పెట్టుబడులు, పరిశ్రమలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం కోసం భారతీ ఎంటర్‌ప్రైజెస్ తరపున ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నియమించాలని సూచించారు.సమావేశంలో స్పందించిన సునీల్ భారతి మిట్టల్ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలను అభినందించారు. భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా తమ సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు.హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్‌కు రెండో ప్రధాన కేంద్రంగా భావిస్తున్నామని సునీల్ మిట్టల్ వెల్లడించారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాగే ఫైబర్ కనెక్టివిటీ విస్తరణపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల వాతావరణంతో తెలంగాణలో భవిష్యత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నామని పేర్కొన్నారు.

# వినడం ఒక కళ... అర్థం చేసుకోవడం ఒక జీవన శైలి!



మనం రోజూ ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు వందల, వేల మాటల అలల మధ్య కొట్టుమిట్టాడుతుంటాం. కానీ, నిలకడగా ఆలోచిస్తే వాటిలో నిజంగా ఎన్ని మాటలు మన హృదయ కవాటాలను తడుడుతున్నాయి? ఎంతమంది అంతరంగ ఆలాపనలను మనం సంపూర్ణంగా ఆకళింపు చేసుకోగలుగుతున్నాం? ఈ నయా జమానాలో మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అత్యంత కీలకమైన, సునిశితమైన అంశం ఇదే! జీవితంలో ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన ఒక పరమ సత్యం ఉంది. వినడం వేరు, అర్థం చేసుకోవడం పూర్తిగా వేరు. వినడం అనేది కేవలం చెవులకు సంబంధించిన ఒక భౌతిక, శారీరక ప్రక్రియ మాత్రమే అయితే అర్థం చేసుకోవడం అనేది మనసుతో ముడిపడిన ఒక అద్భుతమైన, ఆధ్యాత్మిక అంతర ప్రయాణం!నేటి జెట్ స్పీడ్ ప్రపంచంలో, డిజిటల్ యుగపు హోరులో ప్రతి ఒక్కరూ మాట్లాడాలనే ఆరాటంలో ఉన్నారు. తమ సొంత అభిప్రాయాలను మైకుల్లో వినిపించాలని, తమ గొంతును నలుగురికీ చాటాలని తాపత్రయపడుతున్నారు. కానీ, ఎదుటివారి గుండె చప్పుళ్లను, వారి మాటల వెనుక ఉన్న ఆవేదనను శ్రద్ధగా ఆలకించే ఓపిక ఈ తరం సోషల్ మీడియా సమాజంలో ఎంతమందికి ఉంది? ఇక్కడో చిన్న, గమ్మత్తైన జీవిత సత్యం దాగుంది. మనం స్పష్టంగా మాట్లాడటం నేర్చుకోవడానికి కేవలం రెండేళ్ల సమయం పడితే ఎదుటివారి మాటలను సహనంతో, నిజాయితీగా వినడం నేర్చుకోవడానికి మాత్రం ఒక జీవితకాలం కూడా సరిపోవడం లేదు.

అసలు వినడం అంటే ఏమిటి? కేవలం చెవుల మీదుగా శబ్ద తరంగాలు ప్రవహించడమా? కాదు, కానే కాదు! అది ఎదుటివారి అంతరంగ సామ్రాజ్యంలోకి అడుగుపెట్టే ఒక రాజమార్గం. ఓ అమ్మ తన పసిబిడ్డ ఏడుపులోని అసలైన భావాన్ని, ఆకలిని క్షణాల్లో కనిపెట్టేస్తుంది. ఎందుకంటే, ఆమె కేవలం చెవులతో వినదు. తన మాతృ హృదయంతో ఆ శబ్దాన్ని అనుభవిస్తుంది. అలాగే, ఒక ప్రాణస్నేహితుడు మన పెదవుల వెనుక దాగున్న మౌనాన్ని, ఆ మౌనంలో దాగున్న నిగూఢమైన బాధను సైతం ఇట్టే పసిగట్టేస్తాడు. ఎందుకంటే, అతను కేవలం మన పదాలను మాత్రమే కాకుండా మన కళ్లలోని శూన్యాన్ని, మన బాడీ లాంగ్వేజ్‌ను కూడా చాలా సున్నితంగా చదువుతాడు. ఇదీ అసలైన వినికిడి కళకు నిదర్శనం!అయితే, ఈ వినికిడి కళను సొంతం చేసుకోవడం అంత సులువేం కాదు. ఎందుకంటే, నేటి కాలంలో మనం ఎవరి మాటలైనా వినేటప్పుడు మన మనసులో ఇప్పటికే వారికి చెప్పాల్సిన కౌంటర్ సమాధానాన్ని సిద్ధం చేసుకుని కూర్చుంటున్నాం. అవతలి వ్యక్తి ఇంకా తను చెప్పాలనుకున్నది పూర్తి చేయకముందే, మన వంతు ఎప్పుడు వస్తుందా అని ఆత్రుతగా, అశాంతిగా వేచి చూస్తుంటాం. దీనిని వినడం అనరు, కేవలం మన మాటల దాడి కోసం ఎదురుచూసే ఒక విరామం మాత్రమే అంటారు. ఒక ఉత్తమ శ్రోత ఎప్పుడూ తన మనసును పూర్తిగా ఖాళీ చేసుకుని, ఎదుటివారి భావోద్వేగాలకు, వారి అనుభూతులకు తన హృదయంలో కొంచెం చోటిస్తాడు. అలాంటి వ్యక్తుల చెంత మాట్లాడేటప్పుడు ఎవరికైనా సరే ఒక తెలియని మానసిక ప్రశాంతత, భద్రతా భావం లభిస్తాయి.నిజానికి వినడం అనేది ఒక ప్రయాణంలో మొదటి మెట్టు మాత్రమే. అసలైన అతిపెద్ద సవాలు దాన్ని అర్థం చేసుకోవడం లోనే దాగి ఉంది. ఒక మాటను పైపైన వినడం చాలా తేలిక, కానీ ఆ మాట వెనుక దాగిన ఉద్దేశాన్ని, ఆ మనుషుల నేపథ్యాన్ని, వారి కళ్లలోని ఆనందాన్ని లేదా కన్నీటి తడిని అనుభవించడం చాలా గొప్ప విషయం. అర్థం చేసుకోవడం అంటే కేవలం బుద్ధితో ఆలోచించడం కాదు. పూర్తిగా ఎదుటివారి స్థానంలో నిలబడి ఆలోచించడం. వారి కష్టనష్టాలను, వారి మానసిక స్థితిని గౌరవించడం. ఇదొక గొప్ప తత్వం, ఒక అరుదైన సంస్కస్కారం! దీనికి ఎనలేని సహనం, అపారమైన వినయం, అన్నింటికీ మించి మన స్వార్థాన్ని, అహాన్ని పక్కన పెట్టి ఎదుటివారికి ప్రాధాన్యతనిచ్చే విశాల హృదయం కావాలి.మనం ఒక్కసారి చరిత్ర పుటలను గమనిస్తే... ప్రపంచాన్ని మార్చిన గొప్ప గొప్ప నాయకులు, ఆదర్శవంతమైన తత్వవేత్తలు అందరూ అద్భుతమైన శ్రోతలుగా నిలిచారని అర్థమవుతుంది. మహాత్మా గాంధీ దేశంలోని అత్యంత సామాన్య, పేద ప్రజల గోడును, వారి అంతరంగ ఆర్తిని శ్రద్ధగా వినగలిగారు కాబట్టే కోట్ల మంది హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకోగలిగారు. ఒక నిబద్ధత గల ఉపాధ్యాయుడు తన క్లాస్‌రూమ్‌లోని విద్యార్థుల మౌనంలో దాగున్న సందేహాలను కూడా కనిపెట్టగలడు. ఒక నిజమైన వైద్యుడు రోగి చెప్పే శారీరక లక్షణాల వెనుక ఉన్న మానసిక భయాన్ని, ఆందోళనను అర్థం చేసుకోగలడు. ఈ మహోన్నత శక్తి అంతా వారి వినికిడి నైపుణ్యం నుండి, మానవత్వాన్ని ఆకళింపు చేసుకునే సామర్థ్యం నుంచే ఉద్భవించింది.ప్రస్తుత సమాజంలో, ముఖ్యంగా ఆధునిక కుటుంబాలలో, స్నేహ సంబంధాలలో, కార్పొరేట్ ఆఫీసులలో అనేక మానసిక ఘర్షణలు, సమస్యలు తలెత్తడానికి ప్రధాన కారణం ఏమిటి? వినడంలో చూపిస్తున్న నిర్లక్ష్యం, ఎదుటివారిని అర్థం చేసుకోవడంలో కనిపిస్తున్న అశక్తతే! నేటి తల్లిదండ్రులు తమ పిల్లల మనసులోని అసలైన ఇష్టాయిష్టాలను, వారి ఆవేదనలను పూర్తిగా వినకుండానే,తమ సొంత ఆశయాలను, పాతకాలపు అభిప్రాయాలను వారిపై బలవంతంగా రుద్దుతున్నారు. భార్యాభర్తల మధ్య రోజురోజుకూ అగాధాలు, అపార్థాలు పెరగడానికి కారణం ఒకరి మనసును మరొకరు ప్రశాంతంగా కూర్చుని వినకపోవడమే. స్నేహితుల మధ్య దూరాలు పెరగడానికి కారణం ఒకరి కష్టాన్ని, మరొకరు వారి కోణంలో నుండి అర్థం చేసుకోలేకపోవడమే. ఈ చిన్నపాటి కమ్యూనికేషన్ గ్యాప్స్, అహంకారాలే కాలక్రమేణా పెద్ద పెద్ద గోడలుగా మారుతున్నాయి.మనం ఈ అద్భుతమైన వినికిడి కళను, అర్థం చేసుకునే ఉదాత్తమైన తత్వాన్ని గనుక మన దైనందిన జీవితంలో అలవాటు చేసుకుంటే మన చుట్టూ ఎంతటి సానుకూల మార్పు వస్తుందో ఒక్కసారి ఊహించండి! మనం ఎప్పుడైతే ఇతరుల మాటలను శ్రద్ధగా ఆలకించడం ప్రారంభిస్తామో, అప్పుడే బంధాల మధ్య నమ్మకం అనే పునాది గట్టిపడుతుంది. ఎదుటివారిని వారి తప్పొప్పులతో సహా అర్థం చేసుకోవడం మొదలుపెట్టినప్పుడు మన అంతరంగంలో సహనం, కరుణ, నిరపేక్షమైన ప్రేమ రెట్టింపవుతాయి. ఇది కేవలం అవతలి వారికి మనం చేసే మేలు కాదు మనల్ని మనం ఒక పరిపూర్ణ మానవుడిగా మార్చుకునే అద్భుతమైన పరిణామ క్రమం. ఎందుకంటే, నిజాయితీగా వినడం అలవరచుకున్న వ్యక్తిలో అహంకారం క్రమంగా కరిగిపోతుంది, వారి జీవిత దృక్పథం హిమాలయమంత విశాలంగా మారుతుంది.కాబట్టి, ఈ క్షణం నుంచే మన జీవన శైలిని కాస్త మార్చుకుందాం. ఏదైనా మాట్లాడే ముందు లేదా స్పందించే ముందు ఎదుటివారు ఏం చెబుతున్నారో పూర్తిగా వినడం నేర్చుకుందాం. మాట విన్న వెంటనే తొందరపడి ఒక జడ్జిమెంట్‌కు వచ్చేయకుండా, వారి పరిస్థితిని అర్థం చేసుకునేందుకు హృదయపూర్వక ప్రయత్నం చేద్దాం. మన ఇంట్లో, మన ఫ్రెండ్స్ సర్కిల్‌లో, మన ఆఫీసు డెస్క్ దగ్గర ప్రతి చోటా ఈ వినికిడి సూత్రాన్ని పాటిద్దాం. ఎందుకంటే, ఈ లోకంలో మాట్లాడే వాచాలురు, ఉపన్యాసాలు ఇచ్చేవారు కోట్లలో దొరుకుతారు కానీ, నిశ్శబ్దంగా విని, మనసుతో అర్థం చేసుకునే ఆత్మీయులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన, సున్నితమైన వ్యక్తులలో మనం ఒకరిగా మారగలిగితే మన జీవితమే కాదు, మన స్పర్శ తగిలే ప్రతి ఒక్కరి జీవితం ఎంతో అర్థవంతంగా, ఆనందమయంగా రూపాంతరం చెందుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు!



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# ప్రభుత్వ బడుల కుదింపు.. విద్యా సమానత్వంపై వేటు..!

ఒక వ్యక్తి జీవితాన్ని మార్చగలిగే అత్యంత శక్తివంతమైన సాధనం విద్య. మనిషి వ్యక్తిత్వ వికాసం, సామాజిక చైతన్యం, ఆర్థిక స్వావలంబన, ప్రజాస్వామ్య విలువల పట్ల అవగాహన, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం—ఇవన్నీ విద్య ద్వారానే సాధ్యమవుతాయి. అందుకే విద్యను మానవ వనరుల అభివృద్ధికి మూలస్తంభంగా భావిస్తారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు సమాజ నిర్మాణ శిల్పి. అలాంటి విద్యా వ్యవస్థ బలహీన పడితే దేశ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది.

ఒకప్పుడు విద్య ప్రధానంగా ప్రభుత్వ బాధ్యతగా ఉండేది. ప్రభుత్వ పాఠశాలలే విద్యకు ప్రధాన కేంద్రాలు. కొద్ది సంఖ్యలో సేవా దృక్పథంతో మిషనరీ పాఠశాలలు మాత్రమే ఉండేవి. కానీ ఆర్థిక సంస్కరణల అనంతరం విద్య క్రమంగా వ్యాపారంగా మారింది. కార్పొరేట్ విద్యాసంస్థలు విస్తరించడంతో నాణ్యమైన విద్య అనేది ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పేదలు, వెనుకబడిన వర్గాల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" ఏర్పాటు చేయాలని ప్రకటించింది. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, క్రీడా వసతులు, హాస్టళ్లు, ఉపాధ్యాయుల నివాసాలతో కూడిన సమగ్ర విద్యా ప్రాంగణాలను నిర్మించాలనే లక్ష్యం అభినందనీయం. విద్య ద్వారా సామాజిక మార్పు తీసుకురావాలనే సంకల్పం ప్రశంసనీయం.

అయితే మంచి ఉద్దేశం ఉన్నంత మాత్రాన ఆ విధానం సమాన విద్యకు దోహదపడుతుందా అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను నిర్మించడానికి సుమారు రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదివినా, మొత్తం 119 పాఠశాలల్లో సుమారు మూడు లక్షల మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం లభిస్తుంది. కానీ తెలంగాణలో ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య దీనికంటే అనేక రెట్లు ఎక్కువ. అంటే అత్యధిక మంది విద్యార్థులు యథాతథంగా సాధారణ ప్రభుత్వ పాఠశాలలపైనే ఆధారపడాల్సి ఉంటుంది.దీని వల్ల విద్యా వ్యవస్థలో రెండు వేర్వేరు స్థాయిలు ఏర్పడే ప్రమాదం ఉంది. కొద్దిమంది విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు, మిగిలిన లక్షలాది మంది పిల్లలకు పరిమిత వనరులు. ఇది విద్యలో అవకాశాల సమానత్వానికి విరుద్ధం. ప్రజా ధనాన్ని ఎంపిక చేసిన కొద్దిమంది విద్యార్థులపైనే అధికంగా వెచ్చించడం సామాజిక అసమానతలను మరింత పెంచే అవకాశముంది. నిజమైన సంక్షేమం అంటే కొద్దిమందిని అత్యున్నత స్థాయికి చేర్చడం కాదు; ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య అందేలా చేయడం.

ఇటీవల తెలంగాణకు చెందిన విద్యావేత్తల బృందం ఫిన్లాండ్ విద్యా వ్యవస్థను అధ్యయనం చేసింది. ప్రపంచంలో అత్యుత్తమ విద్యా వ్యవస్థలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఫిన్లాండ్ విజయానికి మూల కారణం "సమానత్వం". అక్కడ విద్య అనేది ప్రతిభావంతులైన కొద్దిమందిని తయారు చేయడానికి కాదు; ప్రతి విద్యార్థి తన పూర్తి సామర్థ్యాన్ని చేరుకునేలా చేయడానికి రూపొందించబడింది. అందుకే అక్కడ ప్రభుత్వ పాఠశాలల మధ్య నాణ్యతలో తేడాలు ఉండవు. నగర పాఠశాలకు లభించే వనరులే గ్రామీణ పాఠశాలకు కూడా అందుతాయి. అర్హతగల ఉపాధ్యాయులు, ఆధునిక బోధనా పద్ధతులు, సమాన వసతులు అన్నీ ప్రతి పాఠశాలకు సమానంగా కల్పిస్తారు. ప్రత్యేకంగా "మోడల్ స్కూల్స్", "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" వంటి వ్యవస్థలు నిర్మించకుండా ప్రతి పాఠశాలనే ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడం వారి లక్ష్యం. అందుకే ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది.ఈ అనుభవం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. కొద్దిమంది విజేతలను తయారు చేయడం కన్నా, అందరికీ సమాన అవకాశాలు కల్పించే విద్యా వ్యవస్థే నిజమైన ప్రజాస్వామ్య విద్యా వ్యవస్థ. అదే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన మార్గం.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం వైపు అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం నాలుగు వేల పాఠశాలలకు కుదించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంటే సుమారు 23 వేల పాఠశాలలు మూసివేత లేదా విలీనానికి గురయ్యే అవకాశం ఉంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాల్సిన సమయంలో వాటిని తగ్గించడం విద్యా వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 18,317 ప్రాథమిక పాఠశాలలు, 3,141 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4,705 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో సుమారు 12,782వేల గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాంటప్పుడు 27 వేల పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేస్తే మూడు, నాలుగు గ్రామాలకు ఒకే పాఠశాల మిగిలే పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు పాఠశాలకు చేరుకోవడం మరింత కష్టతరమవుతుంది.ప్రభుత్వం ఇప్పటికే ఈ దిశగా అడుగులు వేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న 1,441 పాఠశాలలను మూసివేసింది. అలాగే ప్రస్తుతం ఉన్న 1,388 గురుకులాలను 100 పెద్ద సమగ్ర విద్యాసంస్థలుగా మార్చే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. దీనికి "యంగ్ ఇండియా గురుకులాలు" అనే కొత్త పేరు పెట్టింది. ఇప్పుడు అదే నమూనాను ప్రభుత్వ పాఠశాలలపై కూడా అమలు చేయాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది.ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మరో అంశం విద్యార్థుల రవాణా. పాఠశాలలు దూరంగా ఉన్నా బస్సులు ఏర్పాటు చేసి ఇంటి వద్ద నుంచి విద్యార్థులను తీసుకువచ్చి తిరిగి ఇంటి వద్దే దింపుతామని ప్రభుత్వం చెబుతోంది. వినడానికి ఇది ఆకర్షణీయంగా అనిపించినా, ఆచరణలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం చెప్పినట్లుగా ఒక్కో పాఠశాలలో సగటున 350 మంది విద్యార్థులు ఉంటారని భావిస్తే, ఒక్కో పాఠశాలకు కనీసం ఏడు బస్సులు అవసరం. నాలుగు వేలకుపైగా పాఠశాలలకు మొత్తం సుమారు 32,935 బస్సులు కావాల్సి వస్తుంది. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీ వద్ద పది వేల బస్సులు కూడా లేవు. అలాంటప్పుడు మరో మూడు రెట్లు అదనపు బస్సులను సమకూర్చడం, వాటికి డ్రైవర్లు, నిర్వహణ ఖర్చులు, ఇంధనం, మరమ్మతులు, భద్రత వంటి అంశాలను నిర్వహించడం ప్రభుత్వానికి ఎంతవరకు సాధ్యమవుతుందో స్పష్టత లేదు.

అంతేకాదు, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు ప్రతిరోజూ గంటల తరబడి ప్రయాణించడం వల్ల అలసట, చదువుపై ఆసక్తి తగ్గడం, బాలికల భద్రత వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. విద్యార్థికి ఇంటికి దగ్గరలోనే పాఠశాల ఉండటం అనేది విద్యా హక్కులో భాగం. దాన్ని ప్రత్యామ్నాయంగా రవాణాతో భర్తీ చేయలేం.

ఇక్కడ భారతదేశ విద్యాహక్కు చట్టం, 2009ను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత, నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. ఈ చట్టం ప్రకారం నివాస ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లలోపు ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లలోపు సెకండరీ పాఠశాల, ఏడు కిలోమీటర్లలోపు హయ్యర్ సెకండరీ పాఠశాల అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఒకవేళ పాఠశాల లేకపోతే మూడేళ్లలోపు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది.ఈ నిబంధనల వెలుగులో చూస్తే పాఠశాలలను భారీగా తగ్గించే విధానం విద్యాహక్కు చట్టం ఆత్మకు పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తోంది. పిల్లలకు పాఠశాలలను దగ్గర చేయాల్సిన ప్రభుత్వం, పాఠశాలలను దూరం చేయడం సరైన విధానంగా కనిపించడం లేదు.

ప్రభుత్వ పాఠశాలలు కేవలం చదువు చెప్పే భవనాలు కావు. అవి గ్రామ సమాజానికి సాంస్కృతిక కేంద్రాలు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వం, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ విలువలు మొదటిసారి పిల్లలు నేర్చుకునే ప్రదేశం ప్రభుత్వ బడి. దేవాలయం ఎంత పవిత్రమో, గ్రంథాలయం ఎంత విలువైనదో, ప్రభుత్వ పాఠశాల కూడా అంతే విలువైన సామాజిక సంస్థ. అలాంటి పాఠశాలలను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటిని తగ్గించడం దీర్ఘకాలంలో ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసే ప్రమాదం ఉంది.విద్యారంగంలో సంస్కరణలు అవసరం అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ సంస్కరణల పేరుతో సమాన అవకాశాలను దెబ్బతీయకూడదు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు నాణ్యమైన భవనాలు, డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, ఆధునిక బోధనా విధానాలు అందించాలి. విద్యార్థుల సంఖ్య తగ్గితే పాఠశాలను మూసివేయడం కాదు; ఎందుకు తగ్గిందో విశ్లేషించి, తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచే చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ బడిని బలహీనపరిస్తే ప్రైవేట్ విద్య మరింత బలపడుతుంది. దాని ప్రభావం పేద, మధ్యతరగతి కుటుంబాలపైనే ఎక్కువగా పడుతుంది.యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి ఆధునిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయడం మంచిదే. కానీ అవి ప్రభుత్వ విద్యా వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాకూడదు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల యంగ్ ఇండియా స్థాయిలోనే అభివృద్ధి చెందాలి. ప్రతి గ్రామంలోని ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను తన గ్రామంలోనే పొందే పరిస్థితి ఏర్పడితేనే విద్యలో నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది.దేశ భవిష్యత్తు భవనాల్లో కాదు, బడుల్లో నిర్మితమవుతుంది. ఆ బడులు ప్రతి పిల్లవాడికి సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాన సమాజం ఏర్పడుతుంది. ప్రభుత్వ విద్యను కాపాడటం అంటే కేవలం పాఠశాలలను కాపాడటం కాదు; భారత రాజ్యాంగం కలలు కన్న సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# మాంగర్ బస్తి ( మరాఠి బస్తి )లో నిర్వహిస్తున్న ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ

- హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్




**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అడ్డగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాంగర్ బస్తి ( మరాఠి బస్తి )లో నిర్వహిస్తున్న ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, పిల్లలకు పోలియో చుక్కలు వేయించారా లేదా అనే విషయాన్ని కుటుంబ సభ్యులను అడిగి నిర్ధారించుకోవాలని సిబ్బందికి సూచించారు.ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి అర్హత గల చిన్నారికి పోలియో చుక్కలు అందేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డాక్టర్ పి. శ్రీధర్ (DIO), మెడికల్ ఆఫీసర్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయ ప్రహరీ గోడ కూల్చొద్దు.. హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దని బీజేపీ నిరసన..

- రోడ్డు విస్తరణ పేరుతో ఆలయాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదు కుమార్ యాదవ్ ..



**కూకట్ పల్లి జూన్ 30 వెలుతురు:**

రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఎల్లమ్మబండ చౌరస్తాలోని హనుమాన్ ఆలయ ప్రహరీ గోడను తొలగించేందుకు అధికారులు గుర్తులు వేయడాన్ని నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకుడు కమలాకర్ రెడ్డి నేతృత్వంలో ఆలయం వద్ద జరిగిన ఈ నిరసనలో బీజేపీ యువమోర్చ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ పనులు ప్రజలందరికీ సమానంగా ఉండాలని, ధనవంతుల ఇళ్ల వద్ద ఒక విధంగా, నిరుపేదల నివాసాల వద్ద మరో విధంగా వ్యవహరించడం సమంజసం కాదని అన్నారు. హనుమాన్ ఆలయ ప్రహరీ గోడను కూల్చే ప్రయత్నం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఆలయ గోడను తొలగించే నిర్ణయం వెనుక ఉన్న కారణాలను స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఆలయాన్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కేశవరావు మాట్లాడుతూ, హిందువుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ ప్రహరీ గోడను యథాతథంగా ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామరాజు, దుర్గ ప్రసాద్, కృష్ణంరాజు, నరసింహాచారి, రాజు, వెంకటస్వామి, శ్రీనివాస్ రెడ్డి, తిరునగరి శ్రీనివాస్, రమేష్, సంతోష్, ప్రవీణ్, రాహుల్, నరసింహ, శ్రీను, భరత్, బాలు, అంజి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఏవీబీ పురం ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి జూన్ 30 వెలుతురు:**



కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కోరారు. కాలనీవాసుల ఆహ్వానం మేరకు మంగళవారం ఏవీబీ పురంలో పర్యటించిన ప్రేమ కుమార్, కాలనీ అధ్యక్షుడు సింహాద్రి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రావు, స్థానికులతో కలిసి పలు వీధులను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ మురుగు నీరు తరచూ రోడ్లపైకి పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. సెంట్ రిటా హైస్కూల్ వెనుక 11వ, రోడ్ లో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ మంజీరా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం విచారకరమని అన్నారు. ప్రజల సమస్యలను అధికారులు అత్యవసరంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించి కాలనీ వాసులకు ఉపశమనం కలిగించాలని ప్రేమ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, శివశంకర్, కాలనీ ప్రతినిధులు ఆర్. వాసు, గోవింద్, లక్ష్మీనారాయణ, బాబూరావు, భాస్కర్‌రావు, తిరుపతి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక సవరణ చేపట్టాలి: మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

**కూకట్ పల్లి జూన్ 30 వెలుతురు:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఆర్‌వోలు, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, ఏఎంసీ వాయిద్ అలీతో కలిసి సవరణ కార్యక్రమం నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పరస్పర సమన్వయంతో పనిచేసి ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమని, అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.



# సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఘన వీడ్కోలు

**సైబరాబాద్ వెలుతురు జూన్ 30:**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆడిటోరియంలో ఈ రోజు 14 మంది పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐ సెల్‌లో సేవలందించిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్, సీటీసీలో పనిచేసిన ఎస్ఐ వెంకట్ రెడ్డి, షాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ శంకర్ రెడ్డి, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ నాగరాజులు, పీసీఆర్‌కు చెందిన ఎస్ఐ షేక్ షబుద్దీన్, రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ నారాయణ గౌడ్, షీ టీమ్స్‌లో సేవలందించిన ఎస్ఐ శ్రీనివాస్, ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ సీతారాం రెడ్డి పదవీ విరమణ పొందారు.వీరితో పాటు ఆమనగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎస్. మురళీధర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ మాణిక్ రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ సుబ్బరాయుడు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసిన ఏఆర్ఎస్ఐ మాణిక్ రెడ్డి, పీసీఆర్ సైబరాబాద్‌లో సేవలందించిన పీసీ ఎ. లక్ష్మణ్ నాయక్, నార్సింగి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెచ్.జి. ఎం. నగేష్, సగర్వంగా పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న తన సహచర పోలీసు అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన ప్రతి ఒక్కరికీ ఎన్నో అనుభవాలు, మధుర జ్ఞాపకాలు ఉంటాయని అన్నారు. జీవితంలో సగానికి పైగా కాలాన్ని పోలీస్ శాఖకు అంకితం చేస్తూ, కుటుంబం కంటే విధులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజల భద్రత కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.పోలీస్ కుటుంబ సభ్యులు కూడా ఎంతో క్రమశిక్షణతో, సహనంతో పోలీసు ఉద్యోగుల సేవలకు అండగా నిలిచారని, వారి త్యాగం కూడా అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో విశ్రాంతి జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే, అవసరమైన సందర్భాల్లో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బంది తమ అనుభవాలను, సేవలను పోలీస్ శాఖతో పంచుకుంటూ శాఖ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలతో పాటు వారి పెన్షన్ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ శ్రీమతి టి. అన్నపూర్ణ, ఎస్ బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మంచాల మండలం వివిధ గ్రామాల్లో ఎస్ఐఆర్ ఓటర్ సర్వే కార్యక్రమంలో పాల్గొన్న ఎడ్మ నరేందర్ రెడ్డి

- అర్హులైన ప్రజల ఓట్లు తొలగిపోకుండా చూడాలి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులకు పిలుపు
- మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి గుండెమోని జయమ్మ మల్లేష్ ముదిరాజ్




**మంచాల వెలుతురు జూన్ 30:**

మంచాల మండలం తెలంగాణ రాష్ట్రంలో మొదలైన (ఎస్ ఐ ఆర్)స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ టర్ సర్వే కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి ఆదేశాల మే రకు తిప్పయిగూడ లోయపల్లి ఎల్లమ్మతండా ఆంబోతుతండా గ్రామంలో పర్యటించిన కాంగ్రెస్ పా ర్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీనాయకులతో కలిసి గడపగడ పకు వెళ్లి బూతు లెవల్ అధికారులు ప్రజల దగ్గరికి వెళ్ళిఎలాంటి వివరాలు సేకరిస్తున్నారు అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అవగాహన కల్పించి ఏ జెంట్ కార్డులు అందజేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రె డ్డి మాట్లాడుతూ ఎస్ ఐఆర్ ఓటర్ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న బూతు లెవల్ అధికారులకు సహకరించి వారు అడిగిన వివరాలకు సరైన సమాధానం చెప్పి అర్హులైన ప్ర జల ఓట్లు తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తగుజాగ్రత్తలు తీసుకోవాలిఅని అన్నారు ఈకార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ తిప్పయిగూడ గ్రామశాఖ అధ్యక్షుడు సురిగాల శ్రీశైలం గ్రామసర్పంచ్ జెనిగే హంసమ్మ కొము రయ్య గోరెంకాల చంద్రయ్య గజ్జి ఐలయ్య చివిరాల సంజీవ జెనిగే నరేష్ యాదవ్ లోయపల్లిగ్రా మ శాఖ అధ్యక్షుడు మాధగోని శివశంకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం నాయకులు నోముల మాజీ ఎంపీటీసీలు జయనాదం రాందాస్ నాయక్ లోయపల్లి గ్రామ పంచాయతీ వార్డు స భ్యుడు మిద్దెనవీన్ గౌడ్ రామచంద్రయ్య ఏర్పుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నందివనపర్తి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు బాధ్యత నాది

- గ్రామస్థులకు హామీ ఇచ్చిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా పనిచేద్దామని పిలుపు
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పందన పట్ల నందివనపర్తి గ్రామస్థుల హర్షం



**యాచారం వెలుతురు జూన్ 30:**

యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు బాధ్యతతన దని వచ్చే విద్యాసంవత్సరం తర్వాత దృష్టి సారిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రం గారెడ్డి హామీఇచ్చారు గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలను టీపీఎస్ గా మార్చాలంటూ నందివ నపర్తి సర్పంచ్ గ్రామస్థులు యాచారం మండల నాయకులు తొర్రూర్ లోని క్యాంపుకార్యాలయం లో ఎమ్మెల్యేను కలిసి వినతీపత్రం అందజేశారు వెంటనే స్పందించిన ఆయన ప్రస్తుత పాఠశాల స్థి తిగతులను తెలుసుకున్నారు యాచారం మండలంలో అన్నివిధాలుగా తగిన నందివనపర్తిలో తె లంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు పేదలకు కార్పొరేట్ తరహా విద్య నందించటమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ముందుకెళ్తున్నతరుణంలో ఆరుట్ల మాదిరిగా మరిన్ని టీపీఎస్ లు ఏర్పాటు చేస్తామని చెప్పారు అలాగే గ్రామంలో నెలకొన్న పలుసమస్యలను ఎమ్మెల్యేదృష్టికి తీసు కురాగా అప్పటికప్పుడే అధికారులతో ఫోన్లో మాట్లాడారు నందివనపర్తి గ్రామంలో మట్టిరోడ్లు కని పించవద్దని అధికారులకు ఆదేశాలుజారీచేశారు అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తానని వెంటనే పనులు పూర్తిచేయాలని చెప్పారు లైబ్రరీ నిర్మాణంలో నిర్లక్ష్యధోరణిపట్ల అధికారులపై ఎ మ్మెల్యే ఆగ్రహంవ్యక్తం చేశారు రాజకీయాలకతీతంగా తనను నమ్మిన జనంకోసమే నిలబడ తాన ని ఈసందర్భంగా గ్రామస్థులకు మల్ రెడ్డి స్పష్టంచేశారు అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కా వాలని ఆయన పిలుపునిచ్చారు ఎమ్మెల్యే స్పందనపట్ల హర్షంవ్యక్తం చేసిన నందివనపర్తి గ్రామ స్థులు ఎమ్మెల్యే రంగారెడ్డి ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయ కులు రాచర్ల వెంకటేశ్వర్లు బిలకంటి శేఖర్ రెడ్డి ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొ న్నారు.

# పొద్దటూరులో జూలై 1 నుంచి పోచమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు

**శంకర్‌పల్లి వెలుతురు జూన్ 30 :**

మండలంలోని పొద్దటూరు గ్రామంలో అతి పురాతనమైన శ్రీ ఊర్ల పోచమ్మ దేవాలయ ప్రతిష్ఠా, గ్రామ దేవత పోచమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు జూలై 1 నుంచి 6 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మొదటి విడతలో జూలై 1 నుంచి 3 వరకు శ్రీ ఊర్ల పోచమ్మ దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మహా గణాధిపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, హవనాలు, అధివాసాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూలై 3న ఉదయం 8.05 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించి, సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. రెండో విడతలో జూలై 4 నుంచి 6 వరకు గ్రామ దేవత పోచమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. జూలై 6న మధ్యాహ్నం 12.59 గంటలకు ఉత్తరాభాద్ర నక్షత్రయుక్త తులా లగ్నంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి, కలశ సమ్మార్జనం, ఋత్విక్ సన్మానం నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారికి బోనాల ఉత్సవం నిర్వహిస్తారు. మహోత్సవాలు గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ లక్ష్మీనారాయణగారి వెంకటకృష్ణ పంతులు వారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు కోరారు.






# కృషి , పట్టుదల ఉంటే బత్తిని కృష్ణ గౌడ్ లాగా ఏదైనా సాధించవచ్చు



- బత్తిని కృష్ణ గౌడ్ సన్మాన సభలో ప్రముఖులు

**యాదగిరిగుట్ట , జూన్ 30 ( వెలుతురు న్యూస్ )**

కృషి పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు అని బత్తిని కృష్ణ గౌడ్ జీవితాన్ని పరిశీలిస్తే అర్థం అవుతుందని విద్యుత్ శాఖ భువనగిరి డివిజన్ డి ఈ సంగం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లాపురం సర్పంచ్ మంగ సత్యనారాయణ, యాదగిరిగుట్ట మాజీ ఉపసర్పంచ్, సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్ తదితరులు అన్నారు. విద్యుత్ శాఖలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న బత్తిని కృష్ణ గౌడ్ పదవీ విరమణ సభ మంగళవారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 35 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన బత్తిని కృష్ణ గౌడ్ అందరి అభిమానం సంపాదించుకున్నారని వారు అన్నారు. యాదగిరిగుట్ట ఆలేరు రాజాపేట మోటకొండూరు బీబీనగర్ తదితర అనేక ప్రాంతాల్లో ఆయన విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి అందరిచే ప్రశంసలు అందుకున్నారని అన్నారు . సాధారణ స్థాయి నుంచి ఎంతో కష్టపడి మంచి స్థాయికి చేరుకున్న బత్తిని కృష్ణ గౌడ్ జీవితం అందరికీ ఆదర్శం అని అన్నారు. మొదట్లో ఒక ప్రైవేట్ కంపెనీలో సుమారు 325 రూపాయల వేతనం నుండి జీవితం ప్రారంభించి విద్యుత్ శాఖలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ స్థాయికి ఎదిగేందుకు బత్తిని కృష్ణ గౌడ్ ప్రతిక్షణం ఎంతగానో కష్టపడ్డారని అన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తూ ఎన్నో ఒత్తిళ్లు ఇబ్బందులు కష్టనష్టాలు ఉన్నప్పటికీ అటు అధికారులతో ఇటు సిబ్బందితో సమన్వయంతో వ్యవహరిస్తూ వినియోగదారులు, ప్రజల అభిమానం సంపాదించుకున్న మంచి మనిషి బత్తిని కృష్ణ గౌడ్ అని అన్నారు. బత్తిని కృష్ణ గౌడ్ తండ్రి బత్తిని రాజయ్య చాలా ప్రముఖ నాయకుడు అని అన్నారు. ఆయన దాతర్ పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గా సీనియర్ నాయకుడిగా అనేక అభివృద్ధి సామాజిక కార్యక్రమాలు చేశారని అన్నారు. కల్లు సొసైటీల ఏర్పాటు, భువనగిరి మండలం నందనంలో నీరా కేంద్రం ఏర్పాటులో అనేక సామాజిక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. బత్తిని రాజయ్య గౌడ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రస్థాయిలో కూడా పెద్ద ఎత్తున పరిచయాలు, పేరు ప్రఖ్యాతులు ఉన్న నాయకుడు అని అన్నారు. తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కృష్ణ గౌడ్ ఆయన తండ్రి పేరును నిలబెట్టేలా ఇటు ఉద్యోగంలో అటు సామాజిక సేవలో, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు దూసుకు వెళ్తున్నారని అన్నారు. సౌమ్యుడు మృదుస్వభావి అయిన బత్తిని కృష్ణ గౌడ్ లో ఆధ్యాత్మిక కోణం కూడా ఉందని ఆయనకు దైవభక్తి ఎక్కువ అని ఆయన వెనుక దైవ శక్తి ఉండి ఆయనను ముందుకు నడిపిస్తోందని కొనియాడారు. దాతర్ పల్లి గ్రామంలో మూడు ఆలయాల అభివృద్ధిలో ఆయన కృషి ఎనలేనిదని అన్నారు. ఆలయాలలో ధూప దీప నైవేద్యాల ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. గ్రామంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుతోపాటు, విద్యార్థులను అనేక విధాలుగా ఆదుకోవడంలో, ప్రజలకు మంచినీటి సౌకర్యం కోసం బోర్లు వేయించడంలో , గ్రామంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించడంలో అనేక రకాల స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఆయన ప్రతినిత్యం భజనలు దైవ పూజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ అటు ఆధ్యాత్మిక రంగంలో , ఇటు సామాజిక సేవా రంగంలో తనదైన ముద్ర వేసిన వ్యక్తి బత్తిని కృష్ణ గౌడ్ అని అన్నారు. బత్తిని కృష్ణ గౌడ్ కు అధికారులు అనధికారులు ప్రముఖ వ్యక్తులతో రాజకీయ ఇతర రంగాల ప్రముఖులతో విస్తృతమైన పరిచయాలు సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఆయన ఇంటికి ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గతంలో పాదయాత్ర సమయంలో ఆయన ఇంటికి స్వయంగా వచ్చి చాలాసేపు బత్తిని కృష్ణ గౌడ్ ఇంటిలో ఆతిథ్యం స్వీకరించి వెళ్లారని అన్నారు. అదేవిధంగా ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా గతంలో బత్తిని కృష్ణ గౌడ్ ఇంటికి వచ్చి వెళ్లారని అన్నారు. దాతరపల్లి గ్రామంలో బత్తిని కృష్ణ గౌడ్ గృహప్రవేశానికి చిన్న జీయర్ స్వామి వారు స్వయంగా వచ్చి ఆయనను ఆశీర్వదించారని అన్నారు . బత్తిని కృష్ణ గౌడ్ కు విస్తృతమైన పరిచయాలు , ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయని కొనియాడారు. ఈ పదవీ విరమణ తర్వాత ఆయన అటు ఆధ్యాత్మిక రంగంలో సామాజిక సేవలో నిరంతరం కృషి చేస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుతున్నామని అన్నారు. బత్తిని కృష్ణ గౌడ్ విజయంలో ఆయన సతీమణి లక్ష్మీదేవి పాత్ర కూడా ఎంతో ఉందని అన్నారు. ఆయన సతీమణి లక్ష్మీదేవి అనుక్షణం ఆయనను వెన్నంటి ప్రోత్సహిస్తూ బత్తిని కృష్ణ గౌడ్ అటు సామాజిక సేవలో ఇటు ఆధ్యాత్మిక సేవలో ఉద్యోగ ధర్మం లో విజయ పదంలో దూసుకెళ్లేలా ఆయన సతీమణి లక్ష్మీదేవి కీలక పాత్ర పోషించిందని వారు అభినందించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన వారు బత్తిని కృష్ణ గౌడ్ లక్ష్మీదేవి దంపతులను ఘనంగా శాలువాలు పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు అంతకుముందు శ్రీరామ్ నగర్ లోని ప్రధాన రహదారి నుండి సభాస్థలి వరకు మంగళ వాయిద్యాలు, బ్యాండ్ మేళాలతో ఘనంగా ఊరేగింపుగా బత్తిని కృష్ణ గౌడ్ లక్ష్మీదేవి దంపతులను సభాస్థలికి ఓపెన్ టాప్ జీపులో ప్రదర్శనగా తీసుకువచ్చారు . అనంతరం నిర్వహించిన అభినందన సభ కార్యక్రమంలో ఆయనకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తిని కృష్ణ గౌడ్ ప్రముఖులను శాలువాలు పూలమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట సెక్షన్ ఏఈ సురేందర్ నాయుడు , బాబురావు, జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి , భైరగాని పుల్లయ్య గౌడ్, బత్తిని ఆనంద్ గౌడ్, బూడిద మధు , బబ్బురి శ్రీధర్ గౌడ్, బిట్టు హరీష్, బోడ సురేష్ పలువురు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు అధికారులు అనధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు



**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 30:**

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొన్నె శంకర్ గౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఘన సన్మాన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (MEO) కె. నరసింహ మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమైన ఘట్టమే అయినప్పటికీ, సేవా కాలంలో చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.అనంతరం PRTU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ పాల్గొని కొన్నె శంకర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించి, విద్యారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని భాస్కర్ గౌడ్, BCTU జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్, జిల్లా గౌరవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాశయ్య గౌడ్, వివిధ జిల్లాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బంధువులు మరియు పలువురు ప్రముఖులు వందలాదిగా పాల్గొని కొన్నె శంకర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన సభ

**నార్కట్‌పల్లి, వెలుతురు జూన్ 30:**



తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) నార్కట్‌పల్లి డిపో కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గంజి వెంకటేశ్వర్లు – జానకమ్మ దంపతులు, పందిళ్లపల్లి బ్రహ్మచారి – భారతమ్మ దంపతుల పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సంస్థకు అందించిన సేవలను కొనియాడుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్యారేజ్ అసిస్టెంట్ మేనేజర్ బెల్లీ సత్తయ్య, డిపో ఇన్‌చార్జి ఏడీసీ కర్నాటి శ్రీనివాస్ కూడా పాల్గొని పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీఎంయూ డిపో అధ్యక్షుడు బడే బోగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనబోయిన సుజాత, డిపో కార్యదర్శి సీహెచ్ నరసింహ, ట్రెజరర్ యాదగిరి, నాయకులు ఆర్. ఎల్లయ్య, ఎన్. మల్లేష్, మహిళా నాయకురాళ్లు మంజుల, శకుంతల, శ్రీవాణి తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందిన ఉద్యోగులను అభినందించారు.

# బోయపల్లి సూర్యగౌడ్ -శ్రావణి ల వివాహానికి ప్రముఖులకు ఆహ్వానం

- జూలై 3న పలివెల శ్రీ వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుక
- వివాహ పత్రికలు అందజేసి హాజరుకావాలని కోరిన కుటుంబ సభ్యులు





**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

ఊకొండి గ్రామానికి చెందిన బోయపల్లి శ్రీను గౌడ్ కుటుంబంలో శుభకార్యం జరగనుంది. బోయపల్లి శ్రీను గౌడ్ ప్రథమ కుమారుడు బోయపల్లి సూర్యగౌడ్ –శ్రావణి వివాహం జూలై 3న పలివెలలోని శ్రీ వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను కలిసి వివాహ మహోత్సవ పత్రికలను అందజేసి వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కుటుంబ సభ్యులు ఆహ్వానించారు.ఈ క్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివాహ పత్రిక అందజేశారు. అలాగే బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను కూడా కలిసి వివాహ మహోత్సవానికి విచ్చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమాల్లో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్, సురిగి రమేష్ గౌడ్, జాల చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె యోచనలో నల్లగొండ –మోత్కూరు మార్గంలో ఆర్టీసీ సిబ్బంది?

**మోత్కూర్, జూన్ 30,వెలుతురు న్యూస్ :**




నల్లగొండ–మోత్కూరు మార్గంలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 1, 2026 నుంచి సమ్మెకు దిగనున్నట్లు సమాచారం.ఉద్యోగుల కథనం ప్రకారం, మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అయితే పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని వారు ఆరోపిస్తున్నారు. గత ఏడాది కాలంగా డిపో మేనేజర్‌కు పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ, పల్లె వెలుగు, ఎలక్ట్రిక్ మరియు ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను పెంచడంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని సిబ్బంది వాపోతున్నారు.కరోనా మహమ్మారికి ముందు ఈ మార్గంలో ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు నడిచేదని, ప్రస్తుతం ఆ స్థాయి సేవలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రహదారి విస్తరణ పూర్తయిన నేపథ్యంలో నల్లగొండ –మోత్కూరు–రామారం–మాసన్‌పల్లి–సింగరాజుపల్లి– జనగాం మార్గంలో మరిన్ని బస్సులను నడిపితే రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించవచ్చని, నిరంతర రద్దీ కారణంగా డ్రైవర్లు, కండక్టర్లు తగిన విశ్రాంతి, భోజన విరామం కూడా తీసుకోలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. అధిక ఒత్తిడిలో విధులు నిర్వహించడం వల్ల వారి పనితీరు, ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు .ఈ సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని లేనిచో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసి దళిత విద్యార్థులకు న్యాయం చెయ్యాలి

- ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్

**మోత్కూర్, జూన్ 30,వెలుతురు న్యూస్ :**




మోత్కూరు మండల పరిధి దత్తపుగూడెం గ్రామంలో తహసీల్దార్ జ్యోతి గారి ఆధ్వర్యంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని కుల వివక్ష చూపినట్లు అయితే సహించేది లేదంటూ ప్రభుత్వ పరంగా వచ్చే ప్రతి సంక్షేమ పథకాలపై ఎస్సి ఎస్టీలు అవగాహన పెంచుకొని వినియోగించుకోవాలని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లో అప్లికేషన్ చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేశాక ప్రభుత్వం నుండి సుమారుగా గత రెండు సంవత్సరాలనుండి విద్యార్థులకు సంబందించిన నిధులు బకాయిలు ఉండడంతో స్కూల్ ప్రిన్సిపాల్ అధిక భారం అవుతుంది అని ఈ సంవత్సరం ఈ స్కీం కింద విద్యార్థులను చేర్చుకునే ఉద్దేశం లేదంటున్నారు.కావున రాష్ట్ర వ్యాప్తంగా దళిత విద్యార్థుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు న్యాయం చెయ్యాలని అన్నారు.మోత్కూర్ సీఐ వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని, సమానత్వాన్ని పాటించకుండా కుల వివక్షత చూపినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.PHC డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని మీ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదయ్య,HWO రాజాలు బాయి, ఆర్ఐ ఇంద్రకుమార్, నర్సింహా,GPO ఎల్లయ్య, ఆశ వర్కర్స్, అంగన్వాడీ టిచర్, గ్రామస్తులు మచ్చగిరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ను పరామర్శించిన గాదరి

**మోత్కూర్, జూన్ 30,వెలుతురు న్యూస్ :**

హైదరాబాద్ పట్టణంలోని నాగోల్ పవన్ సాయి ఆసుపత్రిలో అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్న మోత్కూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్ ను మంగళవారం నాడు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ గారు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.గత కొంత కాలంగా ఉదర సమస్యతో బాధ పడుతున్న మహేందర్ నాథ్ సమస్య తీవ్రం కావడం తో హైదరాబాద్ లో గల పవన్ సాయి హాస్పిటల్ లో చేరి చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడ గా ఉన్నట్లు చెప్పారు.



# అక్రమ వెంచర్లు చేస్తే చర్యలు తప్పవు: సర్పంచ్ పాలకూరి రమాదేవి మునుగోడు గ్రామ పంచాయతీ



**మునుగోడు వెలుతురు జూన్ 23 :**

మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ వెంచర్లు చేస్తే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పాలకూరి రమాదేవి తెలిపారు.మంగళవారం సర్పంచ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ,గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ వెంచర్లు చేస్తూ అమ్ముతున్నారని గ్రామపంచాయతీ దృష్టికి రావడం జరిగిందని అన్నారు.. గ్రామపంచాయతీ పరిధిలోనీ వెంచర్లు ప్లాట్లు కొనేవారు అట్టి వెంచర్ డిటిసిపి పర్మిషన్ మరియు గ్రామపంచాయతీ అనుమతి ఉన్నదా లేదా అని గ్రామపంచాయతీలో సంప్రదించి వివరాలు తెలుసుకొని ప్లాట్లు కొనుగోలు చేయాలన్నారు. లేనియెడల గ్రామపంచాయతీ తీసుకునే చర్యలకు బాధ్యులగురని తెలిపారు.గ్రామ ప్రజలు అన్ని వివరాలు సరిగా ఉన్నాయా లేవ అని తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని గ్రామ పంచాయతీ ప్రజలకు సర్పంచ్ సూచించారు.

# రత్తిపల్లిలో ఎస్ఐఆర్‌కు కాంగ్రెస్ వేగం

- బీఎల్‌ఏగా ఫారాలు నింపుతున్న మాజీ సర్పంచ్ రాజేష్ గౌడ్




**మునుగోడు వెలుతురు జూన్ 30:**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో కార్యక్రమం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా రత్తిపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొంటున్నారు. ఎన్యూమరేటర్లు అందజేసిన గణన ఫారాలను 2002 ఓటరు జాబితా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాటిని సరిచూసే పనులు కొనసాగుతున్నాయి.ఎమ్మెల్యే టైగర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)గా రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్ గౌడ్ స్వయంగా గణన ఫారాలను నింపి ఓటర్లకు సహకారం అందిస్తున్నారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా అవసరమైన వివరాలను పరిశీలిస్తూ ప్రజలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు గణన ఫారాలను సకాలంలో పూర్తి చేసి ఎన్నికల అధికారులకు అందజేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

# పూర్వ జిల్లా విద్యాధికారి, ప్రస్తుత డైట్ ప్రిన్సిపాల్ కి తపస్ సన్మానం



**చేగుంట వెలుతురు జూన్ 30:**

మెదక్ జిల్లా మాజీ విద్యాధికారి ప్రస్తుత డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధా కిషన్ గారిని చేగుంట మండల కేంద్రంలోని తపస్ కార్యాలయంలో ఈరోజు పదవి విరమణ సందర్భంగా వారిని తపస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ డాక్టర్ రాధా కిషన్ గారు స్కూల్ అసిస్టెంట్ గా, డైట్ లెక్చరర్ గా, మూడు జిల్లాల లో డైట్ ప్రిన్సిపాల్ గా,సిరిసిల్ల, మెదక్ జిల్లాల విద్యాధికారిగా అనేక సేవలందించి, అనేకమంది విద్యార్థులను గొప్ప వ్యక్తులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహించారని, మెదక్ జిల్లా విద్యాధికారిగా మెదక్ జిల్లా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని వారన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, కృష్ణమూర్తి, తపస్ జిల్లా ఉపాధ్యక్షులు బాల్ శెట్టి రేఖ, దేవానంద్, సురేందర్, యాదగిరి, జిల్లా కార్యదర్శి సుమతి, మంజులత,ప్రశాంత, పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, సిఆర్పి రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జాతీయ నాయకులను కలిసిన జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్

- **పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణపై నాయకుల మార్గదర్శనం పొందినట్లు వెల్లడి...**





**జహీరాబాద్ వెలుతురు జూన్ 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పూల సంతోష్ మంగళవారం హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌తో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర ప్రముఖ నాయకులను కలిసి పలు అంశాలపై చర్చించారు.పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, ప్రజాసేవను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై నాయకుల నుంచి విలువైన మార్గదర్శనం పొందినట్లు పూల సంతోష్ తెలిపారు. నాయకుల సూచనల మేరకు జహీరాబాద్ పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర నాయకులకు పూల సంతోష్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

# రామకోటి శక్తి గణపతి ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో 30 పాఠశాలల పేద విద్యార్థులకు బుక్కుల పంపిణీ





**బషీర్ బాగ్ వెలుతురు 30 జూన్:**

అన్ని దానాలా కన్నా అన్నదానం, విద్యాదానం గొప్పదని శక్తి గణపతి ఆలయ ట్రస్ట్ సభ్యులు వ్యక్తం చేస్తూ..30పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు 25లక్షల నోటుబుక్కులతో పాటు పెన్నులు పెన్సిల్లు పలుకలు పంపిణీ చేశారు.హైద్రాబాద్,రామ్ కోఠి చౌరస్తాలో శక్తి గణపతి ఆలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుక్కుల పంపిణీ పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ..రామ్ కోఠి లోని శక్తి గణపతి ఆలయం తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యత పొందిన ఆలయం అని కొనియాడారు. భక్తుల కోరికలు తీర్చుకొనేందుకు వేలాది మంది భక్తులు ఇక్కడికి వస్తూ తమ మొక్కులను తీర్చుకుంటారు అని తెలిపారు.శక్తి గణపతి అంటే విద్యా, సిద్ధి,బుద్ధి అంటారు కాబట్టి గత 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం విద్యార్థులకు బూక్కులు పంపిణీ చేస్తూ...నిరుపేద విద్యార్థులకి ఎంతో సహాయం అందిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ మఠం సత్యనారాయణ యాదవ్ తెలియజేశారు.ఈకార్యక్రమంలో చైర్మన్ మఠం సత్యనారాయణ యాదవ్,రగునందన్,రవి,ఆనంద్ యాదవ్,ప్రదీప్,ఆశిష్ అగర్వాల్,కులకర్ణి,శ్యామ్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ భోనగిరి గిరీష్ బాబు పదవీ విరమణ కార్యక్రమం...



**కరీంనగర్ వెలుతురు జూన్ 30:**

పంచాయతీ రాజ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన భోనగిరి గిరీష్ బాబు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున కరీంనగర్లోని ఎస్ బి ఎస్ ఫంక్షన్ హాల్లో ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు గిరీష్ బాబు వృత్తిలో చూపిన అంకితభావం, నిజాయితీ, నిస్వార్థ సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. గిరీష్ బాబు కఠోర శ్రమ, నిబద్ధత.. సహోద్యోగులతో పాటు ప్రజల మన్ననలను, గౌరవాన్ని పొందేలా చేశాయని కొనియాడారు.అధికారిక విధుల నుంచి ఆయన పదవీ విరమణ పొందినప్పటికీ, ఆయన అందరికీ పంచిన ప్రేమ, గౌరవం, స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతాయని సన్మాన పత్రంలో పేర్కొన్నారు. జీవితంలో ప్రారంభం కాబోయే ఈ కొత్త అధ్యాయం.. ఆయనకు మరియు వారి కుటుంబానికి ఆయురారోగ్యాలను, అంతులేని ఆనందాన్ని, ప్రశాంతతను అందించాలని ఆకాంక్షించారు.

# నాగభూషణం లక్ష్మీసేవలు మరు వలేనివి టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 30:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కార్యాలయంలో సబార్డినేటర్ గా విధులు నిర్వహించినా లక్ష్మీ,సర్వే ల్యాండ్ రికా ర్డు విభాగం నందు నిధులు నిర్వహించిన కత్తుల నాగభూషణ్ ల ఇరువురి పదవి విరమణ కార్య క్రమానికి హాజరైన టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ లక్షి నాగభూషణంగార్లు ఇద్దరుగత26 సంవత్సరాలుగా ప్రభుత్వ విధులు నిర్వహించి సేవలు అందించిన వారి సేవలు మరువలేనివికొనియాడారు ఉద్యోగస్తులకు పదవి విరమణ సహజమని తెలిపారు వీరిరువురు అధికారులకు తోటి ఉద్యోగస్తులకు మన్నలను పొందారని కొనియాడారువీరిరువురు శేషాజీవితం ఆయురారోగ్యల తోటిసుఖసంతోషాలతోటి కొనసాగాలని వారు ఆకాంక్షించారు ఇరువురికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌ను కలిసిన కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్

- **కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై దిశానిర్దేశం చేసిన పార్టీ నేషనల్ చీఫ్...**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**



హైదరాబాద్ వేదికగా మంగళవారం రోజున జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కోలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని, మేయర్ పీఠాన్ని దక్కించుకున్నందుకు నితిన్ నబిన్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పనిచేయాలని మేయర్, డిప్యూటీ మేయర్లకు నితిన్ నబిన్ సూచించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర పరిశీలకులు సునీల్ బన్సల్ ను మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగర కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల సునీల్ బన్సల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మేయర్ , డిప్యూటీ మేయర్లను సునీల్ బన్సల్ అభినందించారు.ఈ సందర్భంగా

**మేయర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ**

"పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ స్వయంగా అభినందించి సన్మానించడం తనకు మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని, వారి సూచనలను శిరసా వహిస్తామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. . ప్రస్తుతం స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్మెంట్ నిధులతో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని , ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రతి డివిజన్ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతాం" అని మేయర్ కోలగని శ్రీనివాస్ తెలిపారు.

# రూ.13 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు శంకుస్థాపన

- **పోట్పల్లి, కొత్తూరు(డి) గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రెయిన్ పనుల ప్రారంభం...**
- **అంగన్వాడీ కేంద్రం తనిఖీ.. రోడ్డు భద్రతా చర్యలకు అధికారులకు ఆదేశాలు...**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 30:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం ఝరాసంగం, కోహీర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఝరాసంగం మండలం పోట్పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం కోహీర్ మండలం కొత్తూరు (డి) గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామ పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు, కేంద్ర నిర్వహణను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన అంగన్వాడీ టీచర్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత సీడీపీవోతో మాట్లాడి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాల విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి అత్యవసర రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, నర్సింలు, యువ నాయకుడు కొనింటి మిథున్ రాజ్, గ్రామ సర్పంచులు శ్యామల, మాణిక్ ప్రభు, ఉపసర్పంచ్ ఆనంద్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సేవలకు ఘన సత్కారం.. రంజోల్ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు వీడ్కోలు

- **ఎస్. నరసింహారెడ్డి, తయ్యబా ఉన్నీసా పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన సభ...**
- **భావోద్వేగంగా వీడ్కోలు పలికిన విద్యార్థులు, సహచరులు....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 30:**




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహించిన ఎస్. నరసింహారెడ్డి (బయోలాజికల్ సైన్స్), తయ్యబా ఉన్నీసా (ఇంగ్లీష్) పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గెజిటెడ్ హెడ్‌మాస్టర్ నాను సింగ్ రాథోడ్ అధ్యక్షత వహించారు. కోహీర్ మండల విద్యాధికారి మహ్మద్ జాకీర్ హుస్సేన్, మన తెలంగాణ ప్రతినిధి మహ్మద్ షకీల్ అహ్మద్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ అయూబ్ ఖాన్, మట్టా శంకర్ రెడ్డి, ఎంఐఎం నాయకుడు మహ్మద్ షఫీ, అందోల్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు రాఘవ్ బాయి, మహ్మద్ నాజిమ్ గౌరీ, జీటీఏ జిల్లా అధ్యక్షుడు అనంతరాం, జహీరాబాద్ సెక్టార్ జీటీఏ అధ్యక్షుడు శంకరయ్య, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. తయ్యబా ఉన్నీసా సేవా ప్రస్థానాన్ని వివరిస్తూ మహ్మద్ సలాహుద్దీన్ సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు. విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, మాజీ సహోద్యోగులు, కుటుంబ సభ్యులు భావోద్వేగంతో వారికి వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమం విజయవంతానికి ఖాజా నిజాముద్దీన్ కన్వీనర్‌గా వ్యవహరించగా, షబ్బీర్ అలీ, నర్సింలు, రవిప్రకాశ్, సూర్య, తస్కీన్, భాస్కర్, స్వప్నప్రియ, మాధవి, అనిత, సజిదా, నిర్మల తదితరులు చురుకుగా సహకరించారు.

# ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- **రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ**

**అబిడ్స్ జూన్ 30 (వెలుతురు):**





అర్చకుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంటా లోని తెలంగాణ సారస్వత పరిషత్ ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ , అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దౌలతబాద్ వాసుదేవ శర్మ లతో కలిసి నూతన కార్యవర్గంతో బసవరాజు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ధూప, దీప, నైవేద్య అర్చకుల కుటుంబానికి రాష్ట్రంలో ఉన్న ప్రధాన దేవాలయాల్లో ఉచితంగా శీఘ్ర దర్శనం చేసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అలాగే 10 వేలు ఉన్న వేతనాలను 35 వేలకు పెంచేందుకు బ్రాహ్మణ పరిషత్ తరుపున కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో అర్చక భవనం నిర్మాణం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఖాళీగా ఉన్న 1056 అర్చకుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అర్చకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి , వారి వేతనాలను పెంచేలా కృషి చేస్తానని ఏలూరి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ , అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికీర్తి అమరేశ్వర శర్మ కోశాధికారి నందనం హరికిషన్ శర్మ గౌరవ సలహాదారులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ కన్వీనర్ గొడవర్తి చక్రధరాచార్యులు మహిళ కన్వీనర్ విశాలాక్షి నూతన కార్యవర్గ సభ్యులు అన్ని జిల్లాల అధ్యక్షా కార్యదర్శి కోశాధికారులు పలు జిల్లాల నుండి వచ్చిన అర్చకులు పాల్గొన్నారు.

# సీఎస్ఐఆర్ఐఐసీటీ ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధన సౌకర్యాల ప్రారంభం

- నూతన హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేసిన డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్, జూన్ జూన్ 30, 2026:

భారత శాస్త్రీయ పరిశోధనా మౌలిక సదుపాయాలను, ఆవిష్కరణల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ) ప్రాంగణంలో నాలుగు అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలను కేంద్ర శాస్త్ర, సాంకేతికత, భూ విజ్ఞాన శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇవాళ ప్రారంభించారు. దీనితో పాటుగా 200 మంది విద్యార్థులు ఉండగలిగే ఆధునిక హాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు.ప్రారంభించిన నాలుగు అత్యాధునిక పరిశోధనా కేంద్రాల్లో.. ఫ్లోరో కెమికల్స్ కోసం అధునాతన ఆర్ అండ్ డీ కేంద్రం, వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి, నిరంతర శుద్ధి సంకేతికతల (కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్) పరిశోధన, సస్టెయినబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక సాంకేతిక అభివృద్ధికి సీఎస్ఐఆర్–ఐఐసీటీ అందిస్తున్న నిరంతర సహకారాన్ని అభినందించారు. సైన్స్ ఆధారిత ఆర్థిక వృద్ధి, సాంకేతిక స్వావలంబన, స్థిరమైన అభివృద్ధి ద్వారా వికసిత్ భారత్ కలను సాకారం చేయటంలో భారతదేశ పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.జాతీయ అవసరాలను తీర్చేలా, పరిశ్రమలకు ఉపయోగపడేలా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా శాస్త్రవేత్తలు సరికొత్త, ఉన్నత స్థాయి పరిశోధనలు చేయాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావటం, అంకుర సంస్థలకు మద్దతివ్వటం, మేధో హక్కులు, పరిశ్రమలతో భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవటంపై సీఎస్ఐఆర్–ఐఐసీటీ ప్రత్యేకంగా దృష్టి సారించటాన్ని అభినందించారు. ఆధునిక పరిశోధనా రంగానికి ఇవి కీలకమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం సందర్భంగా 200 మంది విద్యార్థులు ఉండగలిగే నూతన హాస్టల్ సముదాయానికి డాక్టర్ జితేంద్ర సింగ్ శంకుస్థాపన చేశారు. అత్యాధునిక వసతులతో ఏర్పాటు కానున్న ఈహాస్టల్ పరిశోధకులకు, సాధారణ విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన నివాస వసతిని కల్పిస్తుంది. ఇది ఉత్సాహభరితమైన విద్యా వాతావరణాన్ని సృష్టించటమే కాక, దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన యువ పరిశోధకులను ఆకర్షించేందుకు సీఎస్ఐఆర్–ఐఐసీటీ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.ఈ సమావేశంలో సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డీ. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్రీయ రంగంలో సంస్థకున్న ఎనిమిది దశాబ్దాల విశిష్ట వారసత్వాన్ని, అత్యాధునిక పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, పరిశ్రమలతో భాగస్వామ్యం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ద్వారా జాతీయ లక్ష్యాలకు మద్దతివ్వటంలో సంస్థ పోషిస్తున్న కీలక పాత్రను వివరించారు. పరిశ్రమలు, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడే సాంకేతికతలుగా శాస్త్రీయ ఆవిష్కరణలను ఈ సంస్థ మారుస్తోందని చెప్పారు. సీఎస్ఐఆర్–ఐఐసీటీ పరిశోధనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయటంలో నూతన సౌకర్యాల ప్రారంభోత్సవం కీలక ఘట్టమని డాక్టర్ శ్రీనివాస రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ప్రయోగశాలల డైరెక్టర్లు, నేషనల్ సైంటిఫిక్ ఇనిస్టిట్యూషన్ల అధిపతులు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఉన్నతాధికారులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు ఫ్లోరో కెమికల్స్ కోసం ఏర్పాటు చేసిన అధునాతన ఆర్ అండ్ డీ



సంస్థ.. ఔషధాలు, అగ్రో కెమికల్స్, శీతలీకరణ కారకాలు, ఎలక్ట్రానిక్స్, ప్రత్యేక రసాయన పదార్థాల్లో ఉపయోగించే తదుపరి తరం ఫ్లోరోకెమికల్స్‌ను అభివృద్ధి చేయటంలో భారతదేశ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది.ఈ సదుపాయం స్వదేశీ సాంకేతికత అభివృద్ధికి తోడ్పడుతుందని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, పర్యావరణహిత ఫ్లోరినేషన్ సాంకేతికతలను ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.వస్త్ర పరిశ్రమ వ్యర్థ జలాల శుద్ధి కోసం ఏర్పాటు చేసిన వికేంద్రీకృత వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం.. శాస్త్ర, సాంకేతికత విభాగం మద్దతుతో సీఎస్ఐఆర్–ఐఐసీటీ అభివృద్ధి చేసిన వినూత్న వ్యర్థ జలాల శుద్ధి సాంకేతికతను ప్రదర్శిస్తుంది.మెరుగైన పారిశుద్ధ్యం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన ప్రజల ఆరోగ్యం ద్వారా సిరిపురంలోని దాదాపు 6,700 మంది నివాసితులు ప్రయోజనం పొందుతారు. తక్కువ ఖర్చుతో, ప్రకృతి ఆధారిత పరిష్కారంగా, కనీస నిర్వహణ అవసరాలతో రూపొందించిన ఈ సదుపాయం.. దేశ వ్యాప్తంగా ఉన్న టెక్స్‌టైల్ క్లస్టర్లు, చేనేత వర్గాలకు నమూనాగా నిలుస్తుంది.కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ ఫెసిలిటీ.. ఔషధాలు, ఫైన్ కెమికల్స్, ప్రత్యేక రసాయనాల నిరంతర ఉత్పాదకతకు అధునాతన వేదికను ఏర్పాటు చేస్తుంది. ఈ సదుపాయం సురక్షితమైన రసాయన చర్యలను, మెరుగైన ఉత్పత్తి నాణ్యతను, ప్రక్రియల సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రయోగశాలల్లో పరిశోధనల నుంచి వాణిజ్య ఉత్పత్తి స్థాయికి వేగంగా చేరుకునేలా చేయటమే కాక, వ్యర్థాల ఉత్పత్తిని, ఇంధన వినియోగాన్ని తగ్గిస్తుంది.ఇంజినీరింగ్ ప్రక్రియలు, పరికరాల ధ్రువీకరణ, సాంకేతిక ప్రదర్శనల కోసం సమగ్ర పైలట్ స్థాయి మౌలిక సదుపాయాలను పర్యావరణహిత ఇంజినీరింగ్ కాంప్లెక్స్ అందిస్తుంది. ప్రయోగశాల స్థాయి ఆవిష్కరణలకు, పారిశ్రామిక వినియోగానికి మధ్య కీలక అంతరాన్ని పూరించేందుకు పరిశోధకులకు ఇది వీలు కల్పిస్తుంది.

# భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

- ఒక్కరోజులో రూ.2,690 తగ్గిన 24 క్యారెట్ల బంగారం
- రూ.4,869 మేర క్షీణించిన కిలో వెండి ధర
- హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,44,050
- 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,090
- అంతర్జాతీయ పరిణామాలతో పసిడి ధరలకు బ్రేక్
- డాలర్ మారకం, పెట్టుబడిదారుల ధోరణి ప్రభావం
- బంగారం కొనుగోలు దారులకు ఊరట
- నగల కోసం 22 క్యారెట్ల బంగారానికే అధిక డిమాండ్
- 916 హాల్‌మార్క్ తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణుల సూచన
- మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని హెచ్చరిక

హైదరాబాద్ వెలుతురు జూన్ 30:

దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మంగళవారం భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు, డాలర్ మారకం విలువల్లో మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణిలో వచ్చిన మార్పుల ప్రభావంతో పసిడి, వెండి ధరలు క్షీణించాయి. దీంతో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది.క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,44,050గా నమోదైంది. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే రూ.2,690 తగ్గింది. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు, ముంబయి మార్కెట్లలో కూడా ఇదే ధర కొనసాగుతోంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,30,090గా నమోదైంది.వెండి ధర కూడా భారీగా తగ్గింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో కిలో వెండి ధర రూ.2,30,489 నుంచి రూ.2,25,620కు పడిపోయింది. ఒక్కరోజులోనే రూ.4,869 మేర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, పరిశ్రమల డిమాండ్,



పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణి వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.నిపుణుల ప్రకారం బంగారం ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, దిగుమతి వ్యయాలు, పెట్టుబడిదారుల డిమాండ్ వంటి అంశాలు ధరలను ప్రభావితం చేస్తాయి. నగరాలను బట్టి కూడా స్వల్ప వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. అందువల్ల కొనుగోలు చేసే ముందు ఆ రోజు ధరలను పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.ఆభరణాల తయారీలో సాధారణంగా 22 క్యారెట్ల (916) బంగారాన్నే ఉపయోగిస్తారు. 24 క్యారెట్ల బంగారం అత్యంత స్వచ్ఛమైనదైనా, అది చాలా మెత్తగా ఉండటంతో నగల తయారీకి అనుకూలం కాదు. అలాగే బంగారం కొనుగోలు చేసే సమయంలో 916 హాల్‌మార్క్, బీఐఎస్ ధ్రువీకరణ గుర్తులు తప్పనిసరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు.అదేవిధంగా మార్కెట్‌లో ప్రకటించే బంగారం ధరతో పాటు జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు, హాల్‌మార్కింగ్ ఫీజులు కూడా చెల్లించాల్సి ఉంటుందని, వివిధ నగల దుకాణాల్లో ధరలు, ఆఫర్లు, మేకింగ్ ఛార్జీలను పోల్చి చూసి కొనుగోలు చేస్తే అదనపు ఖర్చు తగ్గించుకోవచ్చని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

# సరూర్‌నగర్‌లో పేలుడు.. ఇల్లు ధ్వంసం

- రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో ఒక్కసారిగా భారీ పేలుడు
- కిచెన్‌లో పేలుడు సంభవించడంతో గోడలు, తలుపులు, కిటికీలు ధ్వంసం
- ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు తృటిలో తప్పిన ప్రమాదం
- గ్యాస్ స్టవ్, మూడు సిలిండర్లు, ఫ్రిడ్జ్, గీజర్ సురక్షితంగానే ఉండటం కలకలం
- అగ్నిప్రమాదం ఆనవాళ్లు లేకపోవడంతో మిస్టరీగా మారిన ఘటన
- పేలుడుకు గల కారణాలపై నిపుణులతో దర్యాప్తు
- పోలీసులు, హైడ్రా బృందాలు ఘటనా స్థలంలో పరిశీలన
- పేలుడు శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురి



హైదరాబాద్ వెలుతురు జూన్ 30:

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సోమవారం సంభవించిన భారీ పేలుడు కలకలం రేపింది. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి నివాసంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో ఇంటి కిచెన్ భాగం తీవ్రంగా దెబ్బతింది. పేలుడు ధాటికి గోడలు పగిలిపోవడంతో పాటు తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. అయితే ఘటన సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటం ఊరట కలిగించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నంబర్–4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 ఏళ్లుగా నివాసముంటున్నారు. సోమవారం ఇంట్లోని కిచెన్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. పెద్ద శబ్దంతో ఇల్లు కంపించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.పేలుడు తీవ్రతకు కిచెన్ గోడలు దెబ్బతినడంతో పాటు ఇంట్లోని తలుపులు, కిటికీల అద్దాలు పగిలిపోయాయి. అయితే పేలుడు అనంతరం ఇంట్లోని గ్యాస్ స్టవ్, మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిడ్జ్, గీజర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించగా అవి సురక్షితంగానే ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా గ్యాస్ లీకేజీ వల్ల జరిగే పేలుళ్లలో అగ్నిప్రమాదం ఆనవాళ్లు కనిపిస్తాయి. కానీ ఈ ఘటనలో అలాంటి ఆనవాళ్లు ఎక్కడా కనిపించకపోవడంతో అసలు పేలుడుకు కారణమేంటన్నది మిస్టరీగా మారింది.సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం హైడ్రా సిబ్బంది, ఇతర సాంకేతిక నిపుణులతో కలిసి ఇంటిని పరిశీలించి పేలుడుకు దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. నిర్మాణ పరమైన లోపాలా, గ్యాస్ ఒత్తిడా, లేక మరేదైనా సాంకేతిక కారణమా అన్న కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.పేలుడు కారణంగా ఇంటికి భారీ నష్టం వాటిల్లినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు, నిపుణుల నివేదిక ఆధారంగా పేలుడుకు గల అసలు కారణాన్ని నిర్ధారించనున్నట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# మంత్రి కొండా సురేఖ ఇంటి ముట్టడికి మున్సిపల్ కార్మికుల యత్నం

- హనుమకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్
- రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మికుల డిమాండ్
- మంత్రి నివాసం వైపు ర్యాలీగా వెళ్లిన కార్మికులు
- భద్రతా చర్యల్లో భాగంగా భారీగా మోహరించిన పోలీసులు
- కార్మిక సంఘాల నాయకులతో పోలీసులు చర్చలు
- డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరిక

హనుమకొండ వెలుతురు జూన్ 30:

హనుమకొండలో మంత్రి కొండా సురేఖ నివాసాన్ని ముట్టడించేందుకు మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ న్యాయమైన




డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.మంత్రి నివాసం వైపు ర్యాలీగా బయలుదేరిన కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, భారీగా పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కార్మిక సంఘాల నాయకులతో పోలీసులు చర్చలు జరిపి ఆందోళనను విరమించాలని కోరారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను వెంటనే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. చాలా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన హామీలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రస్తుతం అందుతున్న వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు, ఇతర సంక్షేమ ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన సీఐటీయూ నాయకులు, తమ డిమాండ్లపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# కేంద్ర ప్రాజెక్టులపై రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మౌనం?: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులపై బీజేపీ ప్రజాప్రతినిధులను నిలదీత
- నితిన్ గడ్కరీ పర్యటనతోనైనా పెండింగ్ ప్రాజెక్టులకు ఆమోదం ఇప్పించాలని డిమాండ్
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచన
- పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్రం వైఖరిని వెల్లడించాలని ప్రశ్న
- తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్



హైదరాబాద్ వెలుతురు జూన్ 30:

కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర బీజేపీ ప్రజాప్రతినిధులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన కీలక ప్రాజెక్టులు, నిధుల అంశంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో బీజేపీ నేతలు విఫలమయ్యారని విమర్శించారు.కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ పర్యటనకు వస్తున్న సందర్భంగా అయినా రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ఆమోదం ఇప్పించేలా బీజేపీ నాయకులు కృషి చేస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులను త్వరితగతిన మంజూరు చేయించే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర బీజేపీ ప్రజాప్రతినిధులు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అభివృద్ధి, పెట్టుబడులపై సీఎం ఫోకస్

- హెచ్‌డీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధులతో అంబులెన్స్‌లు, ఎంఆర్ఐ స్కానర్ ప్రారంభం
- మహిళా స్వయం సహాయక సంఘాలకు భారీగా రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు సూచన
- యాదగిరిగుట్టలో మఠాల భూముల కేటాయింపుకు కొత్త విధానం రూపొందించాలని ఆదేశం
- టీటీడీ తరహాలో భూముల కేటాయింపు, అతిథి గృహాల నిర్మాణానికి మార్గదర్శకాలు
- ఆలయ అభివృద్ధికి భూసేకరణ, టూరిజం సర్క్యూట్‌పై వేగంగా చర్యలకు ఆదేశాలు
- భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో సీఎం సమావేశం
- చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ప్రభుత్వ విజ్ఞప్తి
- తెలంగాణలో భారీ డేటా సెంటర్, ఏఐ క్యాంపస్ ఏర్పాటు చేయాలని భారతీకి ఆహ్వానం
- హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్ రెండో ప్రధాన కేంద్రంగా పరిశీలిస్తున్నట్లు మిట్టల్ వెల్లడి
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రకటించిన భారతీ ఫౌండేషన్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 30:**

రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆధ్యాత్మిక పర్యాటక రంగాల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం వరుస సమావేశాలు నిర్వహించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు



కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్దఎత్తున రుణాలు అందించాలని బ్యాంకులను కోరారు. సంఘాల ఆధ్వర్యంలో లాజిస్టిక్ పార్కులు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆర్థిక సహకారాన్ని పెంచాలని సూచించారు.అనంతరం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం, మఠాలకు భూముల కేటాయింపుపై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భూముల యాజమాన్య హక్కులు దేవస్థానానికే ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి, అదే తరహాలో భూముల కేటాయింపు, అతిథి గృహాల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం భూసేకరణకు వెంటనే నిధులు విడుదల చేయడంతో పాటు పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.ఇక భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌తో జరిగిన సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల విస్తరణపై చర్చించారు. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కోరిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో భారీ సమీకృత డేటా సెంటర్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతుల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. హైదరాబాద్‌లో డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఎయిర్‌టెల్‌ను కోరారు.

ఈ సందర్భంగా సునీల్ భారతీ మిట్టల్ తెలంగాణ ప్రభుత్వ పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను అభినందించారు. భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని ప్రకటించారు. అలాగే హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్ రెండో ప్రధాన కార్యాలయంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ కనెక్టివిటీ విస్తరణకు సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.

# సిగాచి బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు కంపెనీని వదిలిపెట్టం: మంత్రి వివేక్ వెంకటస్వామి

- హరీష్ రావు రాజకీయాల కోసం అసత్య ప్రచారం మానుకోవాలి

**పెద్దపల్లి జిల్లా, గోదావరిఖని వెలుతురు జూన్ 30:**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన దుర్ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి గారు తీవ్రంగా ఖండించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.సిగాచి ప్రమాదంలో 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమైన ఘటన అని పేర్కొన్న మంత్రి, ఈ సంఘటన జరిగిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతతో వ్యవహరించిందన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు స్వయంగా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మంత్రులు శ్రీధర్ బాబుగారు, దామోదర రాజనర్సింహా గారితో కలిసి కార్మిక శాఖ మంత్రిగా తాను వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టామని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలిచిందన్నారు.సిగాచి యాజమాన్యాన్ని ప్రభుత్వం పలుమార్లు పిలిపించి బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగానే ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు దాదాపు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందిందని చెప్పారు.

యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కఠిన చర్యలు తీసుకున్నామని, బాధ్యులపై పలు చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, కంపెనీ సీఎండీని అరెస్ట్ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీల కూడా తనిఖీలు నిర్వహించి యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు




చేపట్టారని వివరించారు.బాధితులకు పూర్తి న్యాయం జరగాలనే స్పష్టమైన వైఖరిని హైకోర్టులో కూడా రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందన్నారు. బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందే వరకు సిగాచి కంపెనీపై ప్రభుత్వ ఒత్తిడి కొనసాగుతుందే తప్ప తగ్గదని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా హరీష్ రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రస్తావిస్తూ మంత్రి కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు. కొండగట్టు ఆర్టీసీ బస్సు ప్రమాదంలో 60 మందికి పైగా భక్తులు మరణించినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు ఘటనాస్థలికి వెళ్లలేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు.తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలు తారుమారు జరిగి, 20 మంది విద్యార్థులు మృతి చెందినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదో హరీష్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సిగాచి ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టప్రకారం తీసుకోవాల్సిన ప్రతి చర్యను తీసుకుందని, బాధిత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయడంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. "సిగాచి కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. వారి కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం అందే వరకు కంపెనీని వదిలిపెట్టం" అని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు స్పష్టం చేశారు.

# తెలంగాణలో శాంతి భద్రతల పరిరక్షణకు సమష్టి కృషి అవసరం

- డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 30:**

తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, సామాజిక సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు రాష్ట్ర నూతన డీజీపీ సీవీ ఆనంద్‌తో సమావేశమై చర్చించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌కు మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. చట్టవ్యవస్థ పటిష్టంగా అమలవడం ద్వారా ప్రజలకు భద్రతాభావం కలుగుతుందని, రాష్ట్ర అభివృద్ధికి శాంతి భద్రతలు మూలస్తంభాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, యువతను నేరాల బారిన పడకుండా చైతన్యపరచడం వంటి అంశాల్లో పోలీసు శాఖ మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించినట్లు సమాచారం. అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం అందేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలో తెలంగాణ



పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువై పారదర్శకత, బాధ్యతాయుత సేవలందిస్తుందనే విశ్వాసాన్ని మాజీ మంత్రి వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని, పోలీసు–ప్రజల మధ్య సమన్వయం మరింత బలపడాలని సూచించారు. ఈ సమావేశంలో మాదిగ మహాశక్తి రాష్ట్ర నాయకులు ముంజగళ్ల విజయ్ కుమార్, ప్రొఫెసర్ కనకయ్య, వంగపల్లి శ్రీను, అడ్వకేట్ సగరపు ప్రసాద్, పోచయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలియజేసిన వారు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు. సామాజిక న్యాయం, అట్టడుగు వర్గాల భద్రత, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ మరింత సానుకూలంగా స్పందించాలని కోరారు. సానుకూల వాతావరణంలో సాగిన ఈ సమావేశం రాష్ట్రంలో శాంతి భద్రతల బలోపేతం, ప్రజా సంక్షేమం, సామాజిక సామరస్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై నిర్మాణాత్మక చర్చలకు వేదికగా నిలిచింది.

# భారత సైన్యానికి కొత్త సారథి.. ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరణ

- సదరన్, సౌత్ వెస్ట్రన్ కమాండ్లకు ఆర్మీ కమాండర్‌గా సేవలు
- సైన్యం ఆధునికీకరణ, సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి
- దాదాపు నాలుగు దశాబ్దాల సైనిక సేవతో అత్యున్నత పదవికి ఎదుగుదల

**ఢిల్లీ వెలుతురు జూన్ 30:**

భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సీఓఏఎస్)గా ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో కొత్త సైన్యాధిపతిగా బాధ్యతలు అందుకున్నారు. న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో సైనిక సంప్రదాయాల నడుమ జరిగిన కార్యక్రమంలో అధికారికంగా కమాండ్‌ను స్వీకరించారు.ఆర్మోర్డ్ కార్ప్స్ (ట్యాంక్ రెజిమెంట్) నుంచి భారత సైన్యాధిపతి పదవిని అధిష్ఠించిన ఏడో అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లోని 2వ లాన్సర్స్ రెజిమెంట్‌లో కమిషన్డ్ అధికారిగా ఆయన సైనిక ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి వివిధ స్థాయిల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ అత్యున్నత పదవికి చేరుకున్నారు.జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు సంబంధించిన కీలక దళాలకు కమాండర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. సరిహద్దు భద్రత, అంతర్గత భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో విశేష సేవలు అందించారు. క్లిష్ట పరిస్థితుల్లో వ్యూహాత్మక నాయకత్వాన్ని ప్రదర్శించిన అధికారిగా సైన్యంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.జనరల్ ధీరజ్ సేథ్ సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్‌లకు ఆర్మీ కమాండర్‌గా కూడా సేవలందించారు. ఈ రెండు కీలక కమాండ్లలో పనిచేసిన అనుభవంతో సైనిక నిర్వహణ, వ్యూహాత్మక ప్రణాళికలు, కార్యాచరణలో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. రక్షణ రంగంలో ప్రణాళికలు రూపొందించడం, సామర్థ్యాల అభివృద్ధి, ఆధునిక యుద్ధ సన్నద్ధత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారు.భారత సైన్యాన్ని సాంకేతికంగా మరింత బలోపేతం చేయడం, ఆధునికీకరణ కార్యక్రమాలను వేగవంతం చేయడం, భవిష్యత్ భద్రతా సవాళ్లకు అనుగుణంగా సైనిక సామర్థ్యాలను పెంపొందించడం వంటి అంశాలు ఆయన నాయకత్వంలో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాల సైనిక అనుభవంతో దేశ అత్యున్నత సైనిక పదవిని అధిష్ఠించిన జనరల్ ధీరజ్ సేథ్‌పై సైనిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పేదవాడి ఇంటి కలను సాకారం చేస్తున్నాం

- ఇళ్ల నిర్మాణంతో పాటు ఆత్మగౌరవాన్ని పెంచే సంక్షేమ కార్యక్రమమని వెల్లడి
- పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా
- ప్రతి ఇంటిలో ఆనందం నింపే పథకమే ఇందిరమ్మ ఇళ్లని ప్రశంస
- ముదిగొండ మండలం ముత్తారంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న భట్టి

**ఖమ్మం జిల్లా వెలుతురు జూన్ 30:**


ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. లబ్ధిదారుడు నారపొంగు రమేష్ నిర్మించుకున్న కొత్త ఇంటికి కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశం చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన ఇల్లు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.ముత్తారంలో జరిగిన ఈ గృహప్రవేశ కార్యక్రమం ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ పథకం పేదల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతోందని, సొంతింటి కలను నిజం చేస్తూ కుటుంబాలకు భద్రత, ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం ఇళ్ల నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, వేలాది నిరుపేద కుటుంబాల జీవితాల్లో ఆత్మగౌరవం, స్థిరత్వం, భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంపొందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని భట్టి విక్రమార్క అన్నారు. పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి వారి జీవితాల్లో ఆనందం నింపడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ పథకం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే సంక్షేమ కార్యక్రమంగా గుర్తింపు పొందుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత: పొన్నం ప్రభాకర్


- ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 30:**

జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ (ఎస్ఐఆర్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటికీ జరుగుతున్న వివరాల సేకరణ, నమోదుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో నెలకొన్న ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వయంగా ఎరువులను తయారు చేయదని స్పష్టం చేశారు. కేంద్రం కేటాయించిన మేరకే రాష్ట్రాలకు ఎరువులు సరఫరా అవుతాయని తెలిపారు.తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రానికి ఎరువుల సరఫరాను తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మంత్రి ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో తగినంత ఎరువులు అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయకుండా కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కేంద్రాన్ని మంత్రి కోరారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఎరువుల ఉత్పత్తి, పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# యోగా లేదా జిమ్.. ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛెంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియష్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్ధించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



# పరగడపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.



# 'టాక్సిక్' విజువల్ వండర్‌గా ఉంటుంది: హ్యూమా ఖురేషీ



'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు.

''ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయి'' అని హ్యూమా అన్నారు.

ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. ఓనం, ఈద్, రక్షాబంధన్ పండగలతో పాటు లాంగ్ వీకెండ్ కావడంతో ఈ వరుస సెలవుల్ని సద్వినియోగం చేసుకునేందుకే ఆగస్టు 26ను విడుదల తేదీగా ఖరారు చేసినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియార, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# నాగార్జున వాయిస్ ఓవర్‌తో అఖిల్ 'లెనిన్' ట్రైలర్..




అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నారు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం వైజాగ్‌లో చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా 'లెనిన్'ను సిద్ధం చేసినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# మహేశ్ మాటల్లో 'రావు బహదూర్' ప్రపంచం..




'ఇక్కడ మేజిక్ అంటే గారడి కాదు.. దృశ్య కావ్యం' అంటున్నారు మహేశ్‌బాబు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఆయన సమర్పిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'. వెంకటేశ్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు. చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. దీపా థామస్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదలైంది. మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠగా, ఆసక్తికరంగా సాగింది. సత్యదేవ్‌తో కలిసి వెంకటేశ్ మహా ఓ సరికొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమైనట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

# డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీమిండియా

**ఆసియా క్రీడల మహిళల జట్టు ఖరారు!**




మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కూడా భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ బాధ్యతల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా సెప్టెంబర్ 2026లో జరగబోయే ఆసియా క్రీడల కోసం బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా భారత మహిళల జట్టును ప్రకటించింది. ఈ టోర్నీలో జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన తమ బాధ్యతలను కొనసాగించనున్నారు.

గత 2023 చైనాలోని హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టు, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఇటీవల జరిగిన ప్రపంచకప్ జట్టుతో పోలిస్తే సెలెక్టర్లు కేవలం ఒకే ఒక మార్పు చేశారు. వికెట్ కీపర్ బ్యాటర్ యాస్తికా భాటియాపై వేటు వేసి, ఆమె స్థానంలో జి. కమలిని జట్టులోకి తీసుకున్నారు. ప్రపంచకప్ మధ్యలో చీలమండ గాయంతో దూరం అయిన స్టార్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, ఆమె మ్యాచ్‌లు ఆడటం అనేది ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది. భారత బ్యాటింగ్ విభాగంలో మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ కీలక పాత్ర పోషించనుండగా.. బౌలింగ్ బాధ్యతలను దీప్తి శర్మ, రేణుకా సింగ్, శ్రీ చరణి, అరుంధతి రెడ్డి, నందిని శర్మ భరించనున్నారు.

**ఆసియా క్రీడలు 2026కు భారత మహిళల జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్★, రాధా యాదవ్, నందిని శర్మ.



# నేటి నుంచే భారత్, ఇంగ్లాండ్ పోరు

**తొలి టీ20కి వర్షం ముప్పు!**

ఐర్లాండ్ సిరీస్ ముగిసిన వెంటనే భారత పురుషుల క్రికెట్ జట్టు మరో ప్రతిష్టాత్మక పోరుకు సిద్ధమైంది. ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్లు ఐదు టీ20లు, మూడు వన్డేల సుదీర్ఘ సిరీస్‌లో తలపడనున్నాయి. జూలై 1న (బుధవారం) దర్హామ్‌లోని రివర్‌సైడ్ మైదానంలో రాత్రి 10:00 గంటలకు (భారత కాలమానం ప్రకారం) మొదటి టీ20 మ్యాచ్ ప్రారంభం కానుంది.

ఇప్పటికే శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సహా పలువురు కీలక ఆటగాళ్లు ఇంగ్లాండ్ చేరుకుని ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే, గాయం కారణంగా స్టార్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఈ టీ20 సిరీస్‌కు దూరం కాగా, వన్డే సిరీస్ సమయానికి ఆయన కోలుకుంటారా లేదా అనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశం ఉండటంతో ఈ వైట్ బాల్ సిరీస్‌పై క్రికెట్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే దర్హామ్‌లో వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నివేదికలు తెలపడం అభిమానులను కాస్త ఆందోళనకు గురిచేస్తోంది.

ఐర్లాండ్ చేతిలో ఎదురైన చారిత్రాత్మక పరాజయం తర్వాత భారత జట్టుకు ఈ ఇంగ్లాండ్ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. కొత్త కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ నాయకత్వ పటిమకు, అలాగే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలకు ఈ పర్యటన ఒక సవాల్‌గా నిలవనుంది. యువ ఆటగాళ్లతో కూడిన టీమిండియా ఐర్లాండ్ పిచ్‌లపై చేసిన తప్పులను సరిదిద్దుకుని, బలమైన ఇంగ్లాండ్ జట్టును వారి స్వదేశీ పరిస్థితుల్లో ఎలా ఎదుర్కొంటుందనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది.

# ఆ పరాజయం మమ్మల్ని కుంగదీసింది: కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్


ఐర్లాండ్ చేతిలో ఎదురైన చారిత్రాత్మక టీ20 సిరీస్ పరాజయంపై భారత సరికొత్త కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ఎట్టకేలకు నోరు విప్పాడు. ఆ ఓటమి తమను తీవ్రంగా కుంగదీసిందని ఆయన అంగీకరించాడు. జూలై 1 నుండి ఇంగ్లాండ్‌తో ప్రారంభం కానున్న సుదీర్ఘ పరిమిత ఓవర్ల సిరీస్ నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అయ్యర్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

ఐర్లాండ్ పర్యటనలో ఎదురైన వైఫల్యంపై శ్రేయాస్ అయ్యర్ మాట్లాడుతూ.. "ఆ ఓటమి మాకు అవమానకరంగా అనిపించలేదు కానీ, మమ్మల్ని తీవ్రంగా కుంగదీసింది. ఎందుకంటే ఐర్లాండ్ అంత అద్భుతంగా ఆడుతుందని మేము అస్సలు ఊహించలేదు. అన్ని విభాగాల్లోనూ వారు మమ్మల్ని అధిగమించారు. అక్కడి మైదానం పరిమాణం, పిచ్ తీరుపై వారికి పూర్తి అవగాహన ఉంది. ఆయా పరిస్థితులను అంచనా వేయడంలో, ప్రణాళికలు రచించడంలో మేము వెనుకబడ్డాం. ఈ క్రెడిట్ అంతా ఐర్లాండ్ జట్టుకే దక్కుతుంది. అయితే, ఆ సిరీస్ నుండి మేము ఎన్నో విషయాలు నేర్చుకున్నాం" అని పేర్కొన్నాడు.

ఇంగ్లాండ్ పర్యటనపై స్పందిస్తూ.. "ఇది మాకు పూర్తిగా ఒక కొత్త అధ్యాయం. మా జట్టులోని కొందరు ఆటగాళ్లకు ఇంగ్లాండ్‌లో ఆడిన అనుభవం ఉంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులు, మైదానాలపై మాకు స్పష్టమైన అవగాహన ఉంది. కాబట్టి ఇంగ్లాండ్‌తో జరగబోయే ఈ సవాల్‌తో కూడిన సిరీస్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం" అని అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు.



# చదువు పేరుతో బరితెగించిన దోపిడీ..








- ప్రైవేట్ స్కూళ్లది 'ఫీజుల' మాఫియా
- కోట్లు దండుకుంటున్న యాజమాన్యాలు.. కన్నీళ్లు పెడుతున్న తల్లిదండ్రులు
- రంగ కవిత గౌడ్... యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...

వెలుతురు, వెలుతురు జూన్ 30:
విద్యను వ్యాపారం చేసి కోట్లు గడిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల దోపిడీ పతాక స్థాయికి చేరింది. ప్రభుత్వ జీవోలను చెత్తబుట్టలో పడేసి, నిబంధనలకు సమాధి కట్టి యథేచ్ఛగా ఫీజుల మోత మోగిస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు పిల్లలను చదివించలేక కన్నీళ్లు పెడుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య తీరుతో తల్లిదండ్రులు గోస పడుతున్నారు.పుట్టగొడుగుల్లా నూతన ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు అవుతున్నాయని వాటికీ ఎటువంటి అనుమతులు లేకుండానే కొనసాగిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**అడ్మిషన్ అంటే అక్షరాలా లక్షలు**

LKG అడ్మిషన్‌కే రూ.25 వేల నుంచి రూ. 1 లక్ష వరకు వసూలు చేస్తూ యాజమాన్యాలు బరితెగించాయి. అడ్మిషన్ ఫీజు, డొనేషన్, బిల్డింగ్ ఫండ్, డెవలప్‌మెంట్ ఛార్జీలు అంటూ తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్నారు. "ఫీజు కట్టకపోతే సీట్ ఇంకొకరికి ఇచ్చేస్తాం" అని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలు జిల్లాలో కోకొల్లలు.

**పుస్తకాల ముసుగులో దారుణ దోపిడీ**

బయట మార్కెట్‌లో రూ. 1500కు దొరికే పుస్తకాలు, నోట్‌బుక్స్ సెట్‌ను స్కూల్‌లో రూ. 6000కు అంటగడుతున్నారు. యూనిఫాం, షూ, టై, బెల్ట్, బ్యాగ్ అన్నీ స్కూల్ స్టోర్‌లోనే కొనాలని వేధిస్తున్నారు. ఒకే క్వాలిటీ ఉన్న షూ బయట రూ. 400 ఉంటే స్కూల్‌లో రూ. 1200. కమీషన్ల కక్కుర్తితో ప్రైవేట్ పబ్లికేషన్ పుస్తకాలను బలవంతంగా రుద్దుతున్నారు. ప్రభుత్వం చెప్పిన NCERT, SCERT పుస్తకాలు పనికిరావంటూ తీసిపారేస్తున్నారు.

**ఏడాదికి 10 రకాల ఫీజులు.. నెలనెలా వడ్డన**

ట్యూషన్ ఫీజుతో ఆగకుండా స్మార్ట్ క్లాస్ ఫీజు, ఏసీ క్లాస్ ఫీజు, ల్యాబ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్పోర్ట్స్ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు, టూర్ ఫీజు, యాన్యువల్ డే ఫీజు, ఎగ్జామ్ ఫీజు అంటూ ఏడాది పొడవునా వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. రెండు నెలలు ఫీజు కట్టలేకపోతే పిల్లలను క్లాస్ బయట నిలబెట్టడం, అవమానించడం, టీసీ ఇచ్చేస్తామని బెదిరించడం నిత్యకృత్యమైంది.

**జీవోలు బేఖాతర్.. అధికారులు నిద్రపోతున్నారా?**

ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో నెం. 1, 2020 ని యాజమాన్యాలు లెక్కచేయడం లేదు. ఏటా 10% కంటే ఎక్కువ ఫీజు పెంచకూడదన్న నిబంధనను తుంగలో తొక్కి 40% వరకు పెంచేస్తున్నారు. ఫిర్యాదులు చేస్తే "మేం చూసుకుంటాంలే" అని చెప్పి DEO, MEOలు చేతులు దులుపుకుంటున్నారు. "యాజమాన్యాల నుంచి మామూళ్లు అందుతున్నాయి కాబట్టే అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు" అని తల్లిదండ్రుల సంఘం నేతలు నేరుగానే ఆరోపిస్తున్నారు.

**తల్లిదండ్రుల ఆవేదన**

"నెలకు రూ. 25వేలు సంపాదిస్తే రూ. 15 వేలు స్కూల్ ఫీజులకే పోతోంది. ఇల్లు ఎలా గడవాలి? పిల్లలకు తిండి ఎలా పెట్టాలి?" అంటూ కొంతమంది తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు. "ఫీజు అడిగితే మా పిల్లలను మెంటల్‌గా టార్చర్ పెడుతున్నారని,టీచర్‌తో తిట్టిస్తున్నారని గత సంవత్సరం తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు..

**తల్లి దండ్రులు కోరుతున్న డిమాండ్లు ఇవే:**


1. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రతి స్కూల్‌పై ఆకస్మిక తనిఖీలు చేయాలి.
2. జీవో 1 ఉల్లంఘించిన స్కూళ్ల గుర్తింపు తక్షణమే రద్దు చేయాలి.
3. ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో, స్కూల్ నోటీస్ బోర్డులో బహిరంగంగా పెట్టాలి.
4. పుస్తకాలు, యూనిఫాం బయట కొనుక్కునే స్వేచ్ఛ ఇవ్వాలి.
5. ఫీజుల నియంత్రణకు జిల్లా స్థాయి కమిటీ వేసి ప్రతి మూడు నెలలకు ఒకసారి విచారణ జరపాలి.


ఈ దోపిడీని ఇప్పటికైనా అడ్డుకోకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని, స్కూళ్ల ఎదుట ఆందోళనకు దిగుతామని విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

రంగ కవిత గౌడ్... యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...



రంగ కవిత గౌడ్...
యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com